



స్వస్థ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ ప్రచార పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఆర్వో,డీఎంహెచ్‌వో తదితరులు

ఆ పాఠశాలకు.. ఆ నలుగురే!

శంకరాపురంలో పాఠశాలలో ఒక టీచర్.. రెండు తరగతులు.. నలుగురు విద్యార్థులు

నిడదవోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నిర్వహణ చూస్తే బారెడు.. హాజరు చూస్తే మూరెడు.. ఆ పాఠశాలను చూసిన వారెవరైనా ఆ మాట అనకమానరు. ఎందుకంటే ఒక ఉపాధ్యాయుడు..రెండు తరగతులు.. నలుగురే విద్యార్థులు..అయినా పాఠశాల నడిచిపోతోంది.. ఇది కృడో మారుమూల కాదండోయ్.. నిడద వోలు మండలం శంకరాపురం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో.. ఇక్కడ 1,2 తరగతులు మాత్రమే కొనసాగుతున్నాయి.రికార్డుల్లో మాత్రం 10 మంది విద్యార్థులు అని చూపెడుతూ ఈ పాఠశాలను నడిపించేస్తున్నా విద్యాశాఖాధి కారులు దృష్టి పెట్టడం లేదు. ఆ బడికి అన్నీ ఆ మాస్టారే కావడంతో ఆయన పాఠశాలకు ఎప్పుడు వస్తారో..ఎప్పటి వరకూ ఉంటారో ఎప్పుడు వెళతారో ఎవరికి తెలియదు. ఇప్పటికే ఈ పాఠశాలలోని 3,4,5 తరగతులను ఈ ఏడాది కిలోమీటరు దూరంలో ఉన్న రావిమెట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో కలిపేశారు. 1,2 తరగతులకు సంబంధించి 10 మంది విద్యార్థులను రికార్డు పరంగా చూపిస్తున్నారు. ఈ ఎంపీపీ పాఠశాలలో ముగ్గురు ఎంఆర్ విద్యార్థులు కాగా వారు పాఠశాలకు రారు. మిగిలిన ఏడుగురు విద్యార్థుల్లో మరో ఇద్దరు విద్యా ర్థులు ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక పాఠశాలకు వెళ్లిపోయారు. మరొక విద్యార్థి నిడదవోలు పట్టణంలోని సుబ్బరాజుపేటకు వెళ్లిపోయినట్టు సమాచారం.దీంతో గత కొంతకాలంగా నలుగురు విద్యార్థులతోనే ఈ పాఠశాల నడుస్తుంది. ఈ పాఠశాలపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.



నిడదవోలు మండలం శంకరాపురం ఎంపీపీ పాఠశాలలో ఒక టీచర్.. నలుగురు విద్యార్థులు



పీజీఆర్ఎస్‌లో ప్రజల సమస్యలు వింటున్న డీఆర్వో, డిప్యూటీ కలెక్టర్

పీజీఆర్ఎస్‌లో 152 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):ప్రజాసమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని జిల్లా రెవెన్యూ అధికారి సీతారామమూర్తి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో 152 అర్జీలు ప్రజల నుంచి స్వీకరించారు. అధికారులు ఉద్దేశపూర్వకంగా పరిష్కరించకపోతే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు అర్జీల యదార్థస్థితిని 1100 కాల్‌సెంటర్ ద్వారా లేదా మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. వాట్సప్ గవర్నెన్స్ 95523 00009 ద్వారా పౌరసేవలు పొందే అవకాశం ఉందన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పి.భాగ్యలక్ష్మి, డీఎల్‌డీవో పి. వీణాదేవి, ఏ స్లీవా రెడ్డి, లేబర్ సహాయ కమిషనర్ వలీ, డీపీఆర్వో కే.లక్ష్మీనారాయణ, జిల్లా రిజిస్ట్రార్ ఆర్.సత్యనారాయణ, ఏడీ సర్వే బి. లక్ష్మీనారాయణ,డీఈవో కె.వాసుదేవరావు పాల్గొన్నారు.



వాన నీటిలో కోటిపల్లి బస్టాండ్ సెంటర్

ముంచిన వాన..

వాన వస్తే ఒక గొడవ.. రాకపోతే మరో గొడవ.. నిన్నటి వరకూ వానలు లేక ఉక్కబోతతో జనం అల్లాడిపోయారు.. ప్రస్తుతం వానలతో తడిసిముద్దవుతున్నారు.. సోమవారం ఉదయం 10 గంటలకు ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైంది..కాసేపటికే భారీ వాన కురిసింది.. రాజమహేంద్రవరం అంతా ఇలా జలమయమైంది.

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



జిల్లా బాధ్యత కలెక్టర్లదే

కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు నాయుడు

- పెరిగిన జీవీఏ లక్ష్యాలు
- హెచ్‌ఏ సత్యవేణికి ప్రశంసలు
- టాప్ 5 మండలాల్లో కడియం, బిక్కవోలు, నల్లజర

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) :'దేశంలో ప్రధాని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎంత ప్రాముఖ్యత కలిగిన వ్యక్తులో అదే ప్రాముఖ్యత కలిగిన జిల్లా కలెక్టర్లు, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను పోటీతత్వంతో ముందుకు నడిపించి ప్రభుత్వానికి 'పేరు తీసుకురావాలి' అని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. అమరావతిలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు జరిగే జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆయన ప్రసంగించారు. జిల్లాల అభివృద్ధికి సంబంధించిన ప్లానింగ్, పొలిటికల్ గవర్నెన్స్, పాలసీలు మేనేజ్‌మెంట్‌పై సీఎం సమీక్షించారు. పొలిటికల్ గవర్నెన్స్‌కు సంబంధించి మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు చూసుకుంటారని, జిల్లా ప్లానింగ్‌కు సంబంధించిన బాధ్యత కలెక్టర్లు తీసుకుని నడిపించాలని సూచించారు.తొలిరోజు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు తూర్పుగోదావరి జిల్లా నుంచి చేకూరి కీర్తి హాజరయ్యారు. ప్రభుత్వ ప్రణాళికల్లో భాగంగా యాక్షన్ టేకెన్ రిపోర్టు (ఏటీఆర్)కు సంబంధించి మాట్లాడారు. ఎకనమిక్ గ్రోత్ ప్రొడక్షన్, ఏపీజీఎస్డీపీ టార్గెట్స్, ఎచీవ్‌మెంట్స్‌పై చర్చించారు. కీ పెర్ఫార్మెన్ ఇండికేటర్స్ (కేపీఎల్ఎస్)కు సంబంధించి స్వర్ణాంధ్ర విజన్ మోనటరింగ్ ఫ్రేమ్ వర్క్, స్కోరింగ్ మెథడాలజీ, జిల్లాలు, మండలాల వారీగా సమీక్ష, సాధించిన ర్యాంకులను వివరించారు. పశుసంవర్థక శాఖకు సంబంధించి బిక్కవోలు మండలం కాపవరం రైతు సేవా కేంద్రానికి చెందిన జె.సత్యవాణి గతేడాది సాధించిన జీవీఏతో ప్రస్తుత ఏడాది లక్ష్యాన్ని బాగా పెట్టుకోవడంతో సమావేశంలో అభినందించారు.జిల్లాలోని బలభద్రపురం, అరికరేవుల రైతు సేవా కేంద్రాలు 1,23వ స్థానాల్లో నిలిచాయి. బిక్కవోలు మండలం కాపవరం గ్రామ వెటర్నరీ అసిస్టెంట్ (ఏహెచ్ఏ) గతేడాది జీవీఏ వసూళ్లు రూ.27.72 కోట్లు. ఈ ఏడాది లక్ష్యం రూ.29.66 కోట్లు. ఆమె గతేడాది రూ.816 కోట్లు జీవీఏ సాధించగా ఈ ఏడాది మరింత ఎక్కువగా రూ.895.14 కోట్లు లక్ష్యంగా పెట్టుకుంది. జీవీఏ సాధనలో రాష్ట్ర స్థాయిలో ముందంజలో నిలిచారు.ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.



సీఎం సమీక్షలో జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి

సాధించాల్సిన లక్ష్యాలు..

- ఇక వివిధ రంగాలలో జీవీఏ లక్ష్యాలు.. ఇంతవరకూ సాధించినవి.. ఇంకా సాధించాల్సిన లక్ష్యంపై నివేదించారు. గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీడీపీ) విషయంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.75,384 కోట్లు జీవీఏ లక్ష్యంకాగా 16.93 శాతం వృద్ధి సాధించాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.13,358 కోట్లు 17.72 శాతం సాధించారు. మిగిలిన మూడు క్వార్టర్లు అంటే 9 నెలల్లో రూ.62,026 కోట్లు 82.28 శాతం సాధించాల్సి ఉంది.
- వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో జిల్లా స్కోర్ 31, గ్రేడ్ సి. ఈ రంగంలో జీవీఏ రూ.28,112 కోట్లు లక్ష్యం అంటే 16.34 శాతం వృద్ధి సాధించాలి. ఇప్పటి వరకూ రూ.3,342 కోట్లు 11.99 శాతం సాధించారు. ఇంకా రూ.24,770 కోట్లు అంటే 88.11 శాతం సాధించాలి. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా టాప్ ఐదు మండలాల్లో బిక్కవోలు, కడియం, నల్లజర్ల మండలాలు ఉండడం గమనార్హం. టాప్ రైతు సేవా కేంద్రాలు (ఆర్ ఎస్‌కే)లలో బలభద్రపురం 1,2,3, అరికరేవులకు స్థానం లభించింది.
- టాప్ జిల్లాలో తూర్పుగోదావరి జిల్లా ఉంది. వ్యవసాయరంగంలో 1839, హార్టికల్చర్‌లో 17,993, యానిమల్ హస్బెండరీ రంగంలో 5135 సాధించి మొత్తం రూ.24,966 కోట్ల జీవీఏ సాధించింది.
- జిల్లాలో పారిశ్రామిక జీవీఏ టార్గెట్ రూ.12,461 కోట్లు దీని వృద్ధి రేటు 16.86 శాతం. ఇప్పటి వరకూ సాధించింది రూ.3026 కోట్లు 24.28 శాతం. ఇంకా చేరవలసిన జీవీఏ లక్ష్యం రూ.9,435 కోట్లు. ఇది 75.72 శాతం. పరిశ్రమల రంగంలో జిల్లా స్కోర్ 67గా ఉండగా, గ్రేడ్ -బి లభించింది. రాజమండ్రిలోని వైట్‌ఫీల్డ్‌ను లాండ్ పార్శిల్ సెక్టార్ కింద ప్రతిపాదించారు.సర్వీసు సెక్టార్‌లో జిల్లా స్కోర్ 76 కాగా, ఏ-గ్రేడ్ లభించింది.
- స్వర్ణాంధ్ర పెర్‌ఫార్మెన్స్ ఇండికేటర్లకు స్కోర్ 63, గ్రేడ్ బి లభించాయి.

ఆనందంగా ఉంది



కాపవరం, బలభద్రపురం గ్రామాల్లో వెటర్నరీ అసిస్టెంట్ బాధ్యతలు నిర్వహిస్తున్నా. కాపవరంలోని నాలుగు ఫౌల్ట్రీల్లో సుమారు 4 లక్షలు, బలభద్రపురంలోని ఏడు ఫౌల్ట్రీల్లో సుమారు 20 లక్షల కోళ్ల ఉంటాయి. ఇవి ఆరోగ్యంగా ఉండి గుడ్ల ఉత్పత్తి చేస్తుండడంతో ఆదాయం కారణంగా జీవీఏ పెరిగి రాష్ట్రంలో ముందంజలో ఉండడం ఆనందంగా ఉంది.**- సత్యవేణి, వెటర్నరీ అసిస్టెంట్, కాపవరం**

రేపటి నుంచి మహిళలకు వైద్య శిబిరాలు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్వస్థ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాల ద్వారా ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకూ వైద్యసేవలు అందించనున్నామని డీఆర్వో టి.సీతారామమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మహిళలకు అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, రక్తపోటు, మధుమేహం, నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్ పరీక్షలు, క్షయ వ్యాధి స్క్రీనింగ్, పోషణ అభియాన్, తల్లి-బిడ్డ సేవలు, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు, వయో వృద్ధుల ఆరోగ్యసేవలు, మానసిక వైద్య సేవలు, ఆయుష్ వైద్యసేవలు అందించనున్నట్టు తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొంటారన్నారు. జిల్లాలో ధవళేశ్వరం పీహెచ్‌సీలో ఈ నెల 17వ తేదీ ఉదయం ప్రారంభ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీపీవో అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ పీడీగా నాతి బుజ్జి బాధ్యతలు



రాజమహేంద్రవరం,సెప్టెంబరు 15 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నాతి బుజ్జి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో కాకినాడ జిల్లా గండేపల్లి, కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో ఎంపీడీవోగా పనిచేసి బదిలీ అయ్యారు.డీఎల్‌డీవో పదోన్నతిపై ఏలూరు జిల్లా డ్వామా పీడీగా బాధ్యతలు నిర్వహించారు. డిప్యుటేషన్‌పై ఇక్కడకు పీడీగా బదిలీపై వచ్చారు.



బాధితుల గోడు వింటున్న మురళీకృష్ణ

డీపీవోలో 40 అర్జీలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో 40 అర్జీలను అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ స్వీకరించారు. బాధితులతో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రూ.5,500 కోట్లు దారి మళ్లించిన జగన్

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కాలేజీల పేరుతో రూ.5500 కోట్లను మాజీ సీఎం జగన్ దారి మళ్లించారని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆరోపించారు.రాజమహేంద్రవరం జేఎన్.రోడ్డులోని సితార హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. గతంలో రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలు నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం వాటాగా రూ.975 కోట్లు ఇచ్చిందని, మళ్లీ దాదాపు రూ.5వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం అప్పుచేసిందన్నార. జగన్ హయాంలో రూ.1400 కోట్లతో పనులు చేపట్టగా అవన్నీ పునాది దశ దాటలేదన్నారు. కాంట్రాక్టర్లుకు రూ.670 కోట్లు బకాయిలు పెట్టారన్నారు. ఈ మొత్తంలో రూ.5500 కోట్లు నిధులు జగన్ దారి మళ్లించారని ధ్వజమెత్తారు. చేసిందంతా చేసి ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని మండిపడ్డారు.ప్రైవేటీకరణకు పీపీపీ విధానానికి వ్యత్యాసం తెలియకుండా జగన్ ఐదేళ్ల పాటు ఎలా సీఎంగా ఉన్నారో అర్థం కావడంలేదన్నారు.తాము అధికారంలోకి వచ్చాక టెండర్లలో పాల్గొన్నవాళ్ల టెండర్లు రద్దు చేస్తామంటూ మెడికల్ కాలేజీల నిర్మాణ కాంట్రాక్టర్లను బెదిరించిన జగన్ జైలు లో ఉండడమే మంచిదన్నారు.ఈ సమావేశంలో ఏపి శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కూటమి నాయకులు కాశి నవీన్ కుమార్, మజ్జి రాం బాబు, వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖాళీ జాగా.. ఇస్తే పోలా!



వాటర్ గ్రిడ్‌కు ఇరిగేషన్ మోకాలడ్డు

- జల్‌జీవన్ మిషన్‌కు అడ్డంకులు
- ధవళేశ్వరంలో స్థలానికి ప్రతిపాదన
- 14 ఎకరాలకు డిమాండ్
- అనుమతించని ఇరిగేషన్ శాఖ
- ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- సీఎంను కలిసే ఆలోచన

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పల్లెపల్లెకు గోదారి నీళ్లు.. ఈ మాట ఎన్నికల సమయంలో వింటూనే ఉంటాం.. ఆ తరువాత మరుగున పడిపోవడం చూస్తూనే ఉంటాం. 2019 ఎన్నికల్లో అయితే వైసీపీ ఇదో ప్రధాన హామీగా ప్రకటించింది.ఆ తరువాత ఐదేళ్ల అధికారంలో ఉన్నా కనీసం పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆరంభించిన పనులు కొనసాగించలేదు. దీంతో పల్లెపల్లెకు గోదావరి నీళ్ల అందకుండాపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో పథ కంపై కదలికి వచ్చింది. జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా పల్లెపల్లెకు గోదావరి నీళ్ల అందించడమే లక్ష్యంగా పనులు సాగుతున్నాయి.

ధవళేశ్వరంలో స్థలం ప్రతిపాదన..

జలజీవన్ మిషన్ పథకానికి సంబంధించి వాటర్ గ్రిడ్ నిర్మాణానికి ధవళేశ్వరంలో ఇరిగేషన్‌కు చెందిన 14 ఎకరాల ఖాళీ స్థలాన్ని ప్రతిపాదించారు. కేంద్రం, రాష్ట్ర భాగస్వామ్యంతో జలజీవన్ మిషన్ పేరిట ఈ పథకం అమలవుతోంది.గ్రిడ్‌కు అవసరమైన స్థలం సేకరణకు పలు చోట్ల ప్రయత్నాలు చేసి ధవళేశ్వరంలో ఇరిగేషన్ భూమిని ప్రతిపాదించారు. గతంలో ఈ భూమిని ఇళ్ల స్థలాలకిచ్చే ప్రయత్నం జరిగింది.కానీ కొందరు అడ్డుకున్నారు.ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఆయా కలెక్టర్ల ద్వారా ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులకు విషయం తెలిపారు.స్పందన లేక సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లే ఆలోచన చేస్తున్నారు.

గ్రామాల్లో సాగుతున్న పనులు

2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం అప్పట్లోనే వాటర్‌గ్రిడ్‌ను ప్రతిపాదించింది.అప్పుడు గ్రామాభివృద్ధిశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ మధురపూడి విమానాశ్రయంలో రూ.1000 కోట్లతో వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించి తర్వాత అంచనా కూడా పెంచారు. ఇదిలా ఉండగా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ధవళేశ్వరం వద్ద గ్రిడ్‌కు సంబంధించి ఏర్పాట్లు చేయడా నికి ప్రయత్నాలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటి సరఫరాకు ప్రణాళిక సిద్ధంచేశారు. పైపు లైన్ల ద్వారా ప్రతి ఇంటికి గోదావరి నీటిని అందించాలనేది ఈ పథకం లక్ష్యం. అప్పట్లోనే కొన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో వాటర్‌గ్రిడ్‌ను కొంతకాలం పట్టించుకోలేదు. తర్వాత నెమ్మదిగా పథకం ఆరంభమైనా.. నిధుల మళ్లింపు కారణంగా అన్ని చోట్లా పూర్తి కాలేదు. 2024లో తిరిగి తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో పథకానికి కదలిక వచ్చింది. రూ.1250 కోట్లతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అవసరమైన అన్ని గ్రామాలకు మంచినీరివ్వడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అనేక గ్రామాల్లో పనులు చేస్తున్నారు.

ఇరిగేషన్ స్థలానికి పట్టు..

ధవళేశ్వరంలో 10 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ నిర్మాణానికి స్థలం చూపించినా దానికి అనుమతివ్వడంలేదు.దీంతో ప్రజాప్రతినిధులు ఆగ్రహంగా ఉన్నారు. పైగా ఇక్కడ ఇరిగేషన్ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి.ఇరిగేషన్‌కు ఇంత ఖాళీ స్థలం ఉన్నప్పటికీ వాటర్ గ్రిడ్‌కు ఎందుకివ్వడంలేదనేది పెద్ద సమస్యగా మారింది. జేగురుపాడులో స్థల పరిశీలన చేసినా అది సరిపోదనే కారణంతో ఇరిగేషన్ స్థలం ప్రతిపాదించారు. ఈ గ్రిడ్ నిర్మాణం కాకుండా గ్రామాల్లో పైపులైన్లు వేసినా, ఓహెచ్‌ఆర్‌లు నిర్మించినా ఫలితం ఏముంటుంది.అక్కడ పని పూర్తయ్యేసరికి..ఇక్కడ వాటర్ గ్రిడ్ పూర్తయితేనే ఉమ్మడి జిల్లా ప్రజలకు గోదావరి నీళ్లందుతాయి.

టీ తాగుతూ..కుప్పకూలిపోయాడు! 7

అభ్యుదయ రైతులకు సన్మానం



రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వినియోగంపై అవగాహన అవసరమని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. పీజీఆర్ఎస్ సమావేశం మందిరంలో సోమవారం అభ్యుదయ రైతులు తొర్రేడు గ్రామానికి చెందిన సుంకవల్లి చౌదరి, ఎన్‌వీవీ శ్రీనివాస్, చినకొండేపూడికి చెందిన జి.నాగరాజు, జి. సతీష్‌ను జిల్లా అధికారులు సన్మానించారు. గత రెండు సీజన్లలో రాజమహేంద్రవరం రూరల్, సీతానగరం మండలానికి చెందిన అభ్యుదయ రైతులు నానో ఎరువుల విని యోగం ద్వారా మంచి ఫలితాలు సాధించా రన్నారు. అవసరానికి మించి యూరియా వాడడం వల్ల నేల సహజస్వభావం దెబ్బతిం టుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ,మత్స్య శాఖ అధికారి నిర్మల కుమారి,అధికారులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ తుది ఎంపిక జాబితా విడుదల

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1,353 ఖాళీలు
- 1,349 మంది అభ్యర్థుల ఎంపిక
- భర్తీకాని ఉద్యోగాలు.. నాలుగు
- కాకినాడ జిల్లా డీఈవో పిల్లి రమేష్

కాకినాడ రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 అభ్యర్థుల తుది ఎంపిక జాబితాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది.ఎంపికైన అభ్యర్థులకు విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు.ఎంపిక పరిధిలోకి వచ్చిన అభ్యర్థుల ధ్రువపత్రాలను సవివరంగా పరిశీలించి మేనేజ్‌మెంట్, పోస్టుల వారీగా తుది ఎంపిక జాబితాలను రూపొందించారు. వాటిని కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాల యం, కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ప్రదర్శనకు ఉంచారు. డీఎస్సీ అభ్యర్థుల ఎంపిక జాబితాలను apdsc.apcfss.in వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు కాకినాడ డీఈవో పి.రమేష్ తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ మేనేజ్‌మెంట్లకు మొత్తం 1,241 ఉద్యోగాలను నోటిఫై చేయగా 1237మంది అభ్యర్థులు ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిలో 621మంది పురుషులు, 616మంది మహిళలు ఉన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ మేనేజ్‌మెంట్‌లో మొత్తం 112 ఉద్యోగాలను నోటిఫైచేయగా 112మంది ఎంపిక కాగా వారిలో పురుషులు 33మంది, మహిళలు 79మంది ఉన్నారని డీఈవో తెలిపారు. తుది ఎంపిక జాబితాలకు సంబంధించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎంపికైన అభ్యర్థుల్లో ఏమైనా అభ్యంతరాలు కానీ, సందేహాలు కానీ ఉంటే తగిన ఆధారాలతో కాకినాడ డీఈవో కార్యాలయానికి వచ్చి నివృత్తి చేసుకోవచ్చని, 7989750963, 7799698462 నెంబర్లలో సంప్రదించవచ్చని డీఈవో సూచించారు.



సదస్సులో మాట్లాడుతున్న గోకివాడ సర్పంచ్ కీర్తి హరనాథబాబు

న్యూఢిల్లీ సదస్సులో గోకివాడ సర్పంచ్

గ్రామాల అభివృద్ధిపై చర్చ

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖలోని తాగునీరు, పారిశుధ్య విభాగాలు, క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా న్యూఢిల్లీలో ఆది, సోమవారాల్లో నిర్వహించిన సదస్సులో కాకినాడ జిల్లా పిఠాపురం మండలం గోకివాడ సర్పంచ్ కీర్తి హరనాథబాబు పాల్గొన్నారు. స్వచ్ఛ సుజల్, నారీబల్‌మిత్ర, సమృద్ధి, సురక్ష, సంపన్న పంచాయతీల ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న 75 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లను ఈ సదస్సుకు ఆహ్వానించారు. గ్రామాల్లో తాగునీరు, సంపూర్ణ పారిశుధ్యం, అభివృద్ధి తదితర అంశాలపై సర్పంచ్ హరనాథబాబు మాట్లాడగా, మిగిలిన సర్పంచ్‌లు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ పాల్గొని సర్పంచ్‌లకు 100



కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న సర్పంచ్ హరనాథబాబు

రోజుల చాలెంజ్ కార్యక్రమంలో చేపట్టాల్సిన అంశాలను వివరించారు. గోకివాడ సర్పంచ్‌కు కేంద్రమంత్రి ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.



మహిళా ప్రతినిధులతో ఎమ్మెల్సీ పద్మశ్రీ

జాతీయ మహిళా సాధికారత సదస్సులో ఎమ్మెల్సీ పద్మశ్రీ

కాకినాడ సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్లో రెండో రోజులు జరిగిన జాతీయ మహిళా సాధికారిత సదస్సులో కాకినాడ నుంచి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ప్రాతినిధ్యం వహించారు. సోమవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణసింగ్, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, పార్లమెంట్ మహిళా సాధికార కమిటీ చైర్‌పర్సన్ దగ్గుబాటి పురందేశ్వరి, రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి, ఏపీ శాసనసభ మహిళా



గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పద్మశ్రీ

కమిటీ చైర్‌పర్సన్ చరితారెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ పద్మశ్రీ మహిళా ప్రతినిధులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన 120 మంది పాల్గొన్నారు.

జిల్లాకు మరో తొమ్మిది పాల్ ల్యాబ్స్

● కోనసీమ జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి రాంబాబు



రాయవరం హైస్కూల్‌లో పాల్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఏఎంవో రాంబాబు

రాయవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు మరో తొమ్మిది పాల్ ల్యాబ్స్ (పర్సనలైజ్డ్ అసెస్‌మెంట్స్ లెర్నింగ్) మంజూరయ్యాయని, వీటిని ఉపాధ్యాయులంతా వినియోగించుకోవాలని సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పిల్లి రాంబాబు సూచించారు. సోమవారం రాయవరం శ్రీరామయ్య జడ్పీ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాల్ ల్యాబ్స్ వినియోగించుకుంటున్న తీరుపై హెచ్ఎం వీ.శాంతి సునీతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని 31 ఉన్నత పాఠశాలల్లో పాల్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పల్ల వెంకన్న నర్సరీ సందర్శన



బర్నేకు మొక్కను అందజేస్తున్న నర్సరీ చైర్మన్ పల్ల సత్తిబాబు, డైరెక్టర్ పల్ల వెంకటేష్

కడియం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడియం పల్ల వెంకన్న నర్సరీని సోమవారం మహారాష్ట్ర శివసేన పార్లమెంటరీ చీఫ్ విప్, సౌర విద్యుత్ కేంద్ర కమిటీ సభ్యుడు, ఎంపీ రంగ్ అప్పా బర్నే సందర్శించారు. వారికి నర్సరీ చైర్మన్ పల్ల సత్తిబాబు, డైరెక్టర్లు వెంకటేష్, వినయ్ మొక్కను అందజేసి స్వాగతించారు. ఈ సందర్భంగా బర్నే మాట్లాడుతూ పిఠాపురం పాదగయకు వచ్చిన తాను కడియం వచ్చినట్లు తెలిపారు. నర్సరీలో దేశ, విదేశీ మొక్కలతో కూర్పు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తున్నాయన్నారు. సోలార్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు అందిస్తున్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



జీవన ఎరువుల డబ్బా

యూరియా దొరకదేమోనని
రైతులను వెంటాడుతున్న
భయం....
యూరియా కృత్రిమ కొరత
కొరతను అరికట్టేందుకు
అధికారుల పరుగులు...
యూరియా కొరత లేదంటున్న
అధికారులు....
కొరత ఉందంటూ
వైసీపీ నిరసనలు....
అసలు యూరియాకు అంత
డిమాండ్ ఏమిటి అన్న చర్చ
ప్రస్తుతం అందరిలోనూ
నడుస్తోంది.
యూరియాకు ప్రత్యామ్నాయం
ఏమీ లేదా అంటే
జీవన ఎరువులు ఉన్నాయని
ప్రకృతి వ్యవసాయ నిపుణుడు
అడ్డాల గోపాలకృష్ణ చెప్తున్నారు.
ప్రకృతి వ్యవసాయంతో ఎరువుల
వినియోగం తగ్గించడమే కాకుండా భూసారాన్ని ఎంతగానో పెంపొందించవచ్చని ప్రకృతి వ్యవసాయాధికారి శ్రీనివాస్ చెప్తున్నారు.



జీవన ఎరువులతో యూరియాకు చెక్!



నానో ఎరువుల డబ్బాలు



యూరియా బస్తా

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

యూరియా కొరత విషయంలో ధర కూడా ప్రభావం చూపిస్తుంది. యూరియా బస్తా ధర కేవలం రూ.267 మాత్రమే. కానీ యూరియా బస్తా ఒక్కింటికి కేంద్ర ప్రభుత్వం ఎంత రాయితీ ఇస్తుందో రైతు సంఘాల నాయకులు అందరికీ కూడా తెలియదు. యూరియా బస్తా ధర వాస్తవానికి రూ.1457.29. కాగా కేంద్రం ప్రభుత్వం 50 కిలోల యూరియా బస్తాకు రూ.1190.79 రాయితీ ఇస్తోంది. దాంతో రైతులకు ఒక్కో బస్తా రూ.267కే అందిస్తున్నారు. యూరియాకు రాయితీ ఉండడం, కాంప్లెక్సు ఎరువులకు లేకపోవడం కూడా ఇందుకు కారణం. యూరియా కలిసి ఉన్న కాంప్లెక్సు ఎరువుల బస్తా రూ.1,350 నుంచి పైమాటే. పంట పరిపూర్ణంగా ఎదిగేందుకు కాంప్లెక్సు ఎరువులు ఎంతో దోహదపడతాయని జిల్లా అధికారులు ప్రచారం చేసినా రైతులు మాత్రం యూరియాపైనే దృష్టి సారిస్తున్నారు. ఇక నానో ఎరువుల తయారీలో భాగంగా యూరియాను తక్కువ ధరకే సిద్ధం చేసిన తయారీదారులు తగినంత ప్రచారం లేకపోవడం, ఒక్కసారిగా రైతులు కొత్త విధానాన్ని అనుసరించకపోవడంకూడా ఇందుకు కారణం. ఇలా ఎన్నో కారణాలు ఉన్నాయి.

యూరియాకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులు

యూరియాలో 90 శాతానికి పైగా నత్రజని ఉంటుంది.దానికి ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో లభించే జీవన ఎరువులు వినియోగించవచ్చని ప్రకృతి వ్యవసాయ నిపుణులు, అధికారులు చెప్తున్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులు అయిన రైజోబియం, అజతోబాక్టర్, అజస్పైరిల్లం, నీటి ఆకుపచ్చ నాచు వినియోగించడం ద్వారా భూమి సహజ స్వభావం దెబ్బతినకుండా నత్రజని శాతాన్ని పెంచవచ్చు.

తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు...


జీవన ఎరువులను వినియోగించడం ద్వారా నాణ్యమైన, ఆరోగ్యవంతమైన పంట దిగుబడులు సాధించవచ్చు. భూసారం మెరుగుపడుతుంది. జీవన ఎరువులు నత్రజనిని స్థిరీకరిస్తాయి. నేల ద్వారా సంక్రమించే తెగుళ్ల బెడద తగ్గి 10 నుంచి 20 శాతం దిగుబడి పెరుగుతుంది. పంట ఉత్పత్తుల్లో ఎక్కడా క్రిమిసంహారక మందుల అవశేషాలు ఉండవు. జీవన ఎరువులను ఒకసారి వినియోగిస్తే తదుపరి వాటంతట అవే వృద్ధి చెందుతాయి. తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులకు దోహదపడుతుంది.

రైజోబియం...

ఇది పైర్ల వేర్లపై బుడిపెలు కలుగజేసి సహజీవనం చేస్తూ గాలిలోని నత్రజనిని మొక్కలకు అందిస్తుంది. ఎకరాకు 40 కిలోల నత్రజని సహజసిద్ధంగా పైరుకు లభ్యం అవుతుంది. అదే విధంగా అజోస్పైరిల్లం, ఆకుపచ్చ నాచును వాడడం వల్ల పైరుకు, చేలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయి. రసాయన ఎరువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

జీవన ఎరువులతో ప్రశాంతంగా సాగు

అడ్డాల గోపాలకృష్ణ, అమలాపురం



యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్న సంఘటనలు చూస్తున్నాం. కానీ జీవన ఎరువులు వినియోగించే రైతులు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ప్రశాంతంగా సాగు చేసుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను మరింత ప్రోత్సహించడంతో పాటు ప్రత్యేక రాయితీలు కూడా కల్పించాలి. ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, మీనామృతం వంటివి మొక్కలకు నత్రజనిని అందించడంలో కీలకంగా పనిచేస్తాయి.

నూతన ఆవిష్కరణలు దిశగా సాగాలి

● అద్విక-25లో నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నన్నయ జ్ఞానం, విశ్వేశ్వరయ్య శ్రద్ధ రెండింటి నుంచి ప్రేరణ పొంది నూతన ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని ఆదికవి నన్నయ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో అద్విక-25 ఇంజనీరింగ్ ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన వీసీ ప్రసన్నశ్రీ, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా నన్నయ విగ్రహానికి, మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ జాతినిర్మాణానికి విశ్వేశ్వరయ్య చేసిన అసమానమైన కృషిని నేడు అంతా అనుభవిస్తున్నారన్నారు. అనంతరం ఓరియంటేషన్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అద్విక ఉత్సవంలో విజేతలకు నగదు బహుమతి, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ నీటిసరఫరా విభాగం ఈఈ బి.వెంకటగిరి, డీఈఈ టి.శ్రీనివాసబాబు, ఏఈ వి.అవినాష్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్‌కుమార్, ఈఈ రవికుమార్, ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్(ఐసీఐ) రాజమహేంద్రవరం సెంటర్ చీఫ్ కన్సల్టెంట్ కేవీ నరసింహారావు, ఓఎన్‌జీసీ విశ్రాంత ఈఈ జీఎవీఎస్ ప్రసాద్, ఇంజనీర్ హరికుమార్, విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ అధ్యాపకులు, ఇంజనీర్లను వీసీ సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



వర్సిటీలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, తదితరులు

జేఎన్టీయూకే: భారత జాతి గర్వించదగ్గ వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కాకినాడ జేఎన్టీయూ ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. యూసీఈకే సివిల్ ఇంజనీరింగ్ విభాగం డాక్టర్ కేఎల్ రావు సెమినార్ హాల్లో ఇంజనీర్ల దినోత్సవ వేడుకలను సోమవారం కె.పద్మకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి వీసీ ప్రసాద్, ప్రొఫెసర్లు ప్రసాదరాజు, మురళీకృష్ణ, ఉదయభాస్కర్,శ్రీనివాసులు, తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ నేటితరం ఇంజనీర్లు ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

●165వ ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా జేఎన్టీయూకే, ఐఈ కాకినాడ లోకల్ చాప్టర్, ఆర్ఐఈఎ ఆధ్వర్యంలో వర్సిటీలోని ఐఈ సెమినార్ హాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు ఏఐ, రోబోటిక్స్‌కి అనుకూలమైన ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలని సూచించారు.



కాకినాడలో మోక్షగుండం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వీసీ ప్రసాద్, ప్రొఫెసర్లు

నిలకడగా గోదావరి

● ధవళేశ్వరం వద్ద పెరుగుదల ..
5,54,609 క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద నిదానంగా పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ నుంచి 5,5,609 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తుండగా, నీటిమట్టం 9.75 అడుగులుగా నమోదయ్యింది. ఎగువన భద్రాచలం వద్ద 39.60 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. ఇదే ఒరవడి కొనసాగితే ధవళేశ్వరం వద్ద 6 లక్షల క్యూసెక్కులు వరకు తరలివచ్చి ఆపై నీటిమట్టం తగ్గవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ముగ్గురు ఎంపిక



పందలపాక నుంచి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బిక్కవోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పందలపాక ఉన్నత పాఠశాల నుంచి అండర్-19 స్విమ్మింగ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. వీరు ఇటీవల కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారిలో సీహెచ్ కార్తీకసూర్య, ఎల్.సతీష్, జీ.దినేషవర్ధన్ ఉన్నారన్నారు. ఎంపికైన విద్యార్థులను, పీడీ యువరాజారెడ్డిని హెచ్ఎంతో పాటు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోణాల సత్తిరాజు, తదితరులు అభినందించారు.

క్యాన్సర్ మహమ్మారిని తరిమేద్దాం

● అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
● బలభద్రపురంలో మొదటి రోజు 169 మందికి స్క్రీనింగ్ పరీక్షలు


బిక్కవోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురం నుంచి క్యాన్సర్ మహమ్మారిని తరిమేద్దామని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన గ్రామంలోని సచివాలయం-2లో బసవతారకం ఇండో- అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో స్క్రీనింగ్ పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రంగరాయ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో 1,295 మందికి పరీక్షలు జరపగా, 65 మంది బాధితులు ఉన్నట్టు గుర్తించారని, దీంతో మిగతావారు భయపడి పరీక్షలు చేయించుకోలేదన్నారు. అలాంటి వారు సోమవారం 169 మంది స్క్రీనింగ్ టెస్టులకు హాజరయ్యారు. బసవతారకం ఆసుపత్రి నుంచి వచ్చిన వారిలో గైనకాలజిస్టులు డాక్టర్ శ్రావణ కుమారి, డా. ప్రవల్లిక, డా. రేణుక, రేడియాలజిస్ట్ డా. ప్రభాకర్, అంకాలజిస్ట్ డా. కృష్ణప్రసాద్‌లతో పాటు బిక్కవోలు, కొంకుదురు పీహెచ్‌సీ వైద్యులు డా. దుర్గాదేవి, డా. రుమన్, డా. విజయలక్ష్మి, డా.గణేష్‌పట్నాయక్ ఈస్క్రీనింగ్ టెస్టులు జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, ఏఎంసీ చైర్మన్ జుత్తుక సూర్యకుమారి, సొసైటి చైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డి, సర్పంచ్ బుంగా రామారావు, కూటమి నేతలు ఉన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

'బాక్సింగ్' పోటీల్లో మహాలక్ష్మికి గోల్డ్‌మెడల్

పిఠాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ కళాశాలల యూత్ బాక్సింగ్ అండర్-19 పోటీల్లో కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల బైపీసీ ఫస్టియర్ విద్యార్థిని పల్లా మహాలక్ష్మి గోల్డ్‌మెడల్ సాధించింది. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెను, ఆమె తండ్రిని, కోచ్ పి.లక్ష్మణరావును ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కేశవరావు అభినందించారు. సీనియర్ అధ్యాపకులు డాక్టర్ శారద, అరుణ, చిన్నబ్బాయి, ఎస్‌కే హుస్సేన్, మొహిద్దీన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి దేవరపల్లి కాశీవిశ్వనాథం, ఆర్‌పీస్ ఇన్‌చార్జి పల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక

పిఠాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కాకినాడ జిల్లా పిఠాపురం బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్లస్ విద్యార్థినులు ఎంపికయ్యారు. కాకినాడ జిల్లా యోగా పోటీల్లో 8-14 సంవత్సరాల కేటగిరీలో పాఠశాలకు చెందిన కె.పవిత్ర (ప్రథమ), జీ.విజయప్రభ (ద్వితీయ), 14-18 సంవత్సరాల కేటగిరీలో కే.సమంత (తృతీయ) స్థానాల్లో నిలిచారు. వీరిని ఎంఈవో జీ.శ్యాంబాబు అభినందించారు. ఉపాధ్యాయులు లీలాదేవి, పద్మావతి, శ్రీవల్లి, పీడీ మంగాయమ్మ, పీఈటీ సత్యప్రియ పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో శ్యాంబాబు

రైతుల కష్టాలు చెప్పుతున్నాయి!

యూరియా కోసం అర కిలోమీటరు క్యూ



ఎటపాక, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత...దాని కోసం రైతులు పడుతున్న కష్టాలకు ఈ చిత్రాలే నిదర్శనం. అల్లూరి జిల్లా ఎటపాక మండలం తోటపల్లి రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. దీంతో చుట్టుపక్కల 10 గ్రామాలకు చెందిన రైతులు తెల్లవారుజామున 3 గంటలకే రైతు సేవా కేంద్రానికి వచ్చారు. యూరియా ఎరువులు పొందేందుకు తమ వంతుగా చెప్పులతో క్యూ కట్టారు. సుమారు అర కిలోమీటరు వరకు చెప్పులతో క్యూ కనిపించింది.

నేడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ మంగళవారం ఉదయం 9 గంటలకు జరుగుతాయని కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 బాలురు, బాలికలకు టెన్నిస్, జిమ్నాస్టిక్స్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థుల ఎలిజిబిలిటీ ఫార్మ్, మిడ్డే మీల్స్ తప్పనిసరిగా తీసుకునిరావాలన్నారు. మరిన్ని వివరాలకు కె.శ్రీనివాసరావు 9059317248, సుధారాణి 9603504337 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పులిమచ్చల టేకు చేప చిక్కింది..



అంతర్వేది, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సముద్రంపై వేటకు వెళ్లిన మత్స్యకారుల వలకు అరుదైన చేప చిక్కింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు సుమారు పది కిలోల పులిమచ్చల టేకు చేప పాట దొరకగా వేలం పాట నిర్వహించారు. దీనిని స్థానికులు వింతగా చూశారు. ఈ చేప పొట్ట భాగంలో, బ్లాడర్‌లో ఔషధ గుణాలు ఉండడంతో ఎక్కువగా మందుల తయారీలో ఉపయోగిస్తారని మత్స్యకారులు తెలిపారు. ఈ చేప ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణిస్తూనే ఉంటుందని, అప్పుడప్పుడు చిక్కుతూ అదృష్టం తెచ్చిపెడుతుందన్నారు.

అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు చిక్కిన పులిమచ్చల టేకు చేప

రూ.2.07 లక్షల విలువైన బాణసంచా సామగ్రి సీజ్



జొన్నాడలో సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ నరేష్

ఆలమూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ శివారు జాతీయ రహదారి సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా సామగ్రిని ఆలమూరు పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జొన్నాడలో జాతీయ రహదారికి దగ్గర్లో కొవ్వూరి సుధాకరరెడ్డి రేకులషెడ్డులో ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేసినట్టు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి రూ. 2,07,165 విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వివరించారు.

వానొచ్చే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు వర్షంతో నీటితో నిండిపోయాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఆ దృశ్యాలే ఇవి



కాకినాడలో జోరుగా కురుస్తున్న వర్షం



సామర్లకోటలోని ఓ వీధిలో వర్షం నీరు



కాకినాడ సాంబమూర్తి నగర్‌లోని ఫ్లైఓవర్ పక్క వీధిలో వర్షపునీరు





పిఠాపురంలో కురుస్తున్న భారీ వర్షం



రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ రోడ్డులోని రైల్వే అండర్‌పాస్ వద్ద వర్షం నీటిలో వాహనదారుల ఇబ్బందులు

భవనం పైనుంచి పడి మహిళ మృతి



దుర్గ మృతదేహం వద్ద విలపిస్తున్న భర్త

కాకినాడ క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం పై నుంచి పడి మహిళా కూలీ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ పర్లోవపేటకు చెందిన రాగితి దుర్గ (37)కు భర్త మునలయ్య, కుమార్తె సత్యవేణి ఉన్నారు. కాగా మునలయ్య చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తుండగా అతడి భార్య దుర్గ కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు తాపీ పనుల్లో కూలీగా పని చేస్తుంది. ఈ క్రమంలో సోమవారం సాంబమూర్తినగర్ మూడోవీధిలో మహ్మద్ జానీకి చెందిన నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనంలో దుర్గ పనిచేస్తూ మూడో అంతస్తు పైకి ఇటుకలు మోస్తూ ప్రమాదవశాత్తు పై నుంచి కిందికి పడిపోయింది. తీవ్రగాయాల పాలైన దుర్గ అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న ఆమె భర్త మునలయ్య రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

టీ తాగుతూ కుప్పకూలి మరణించిన కూలీ



సూర్యప్రకాశరావు (ఫైల్)

ప్రత్తిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీ హోటల్ వద్ద టీ తాగుతూ కుప్ప కూలి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో జరిగింది. గ్రామానికి చెందిన బెంతుపల్లి సూర్యప్రకాశరావు (32) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం కూలీ పనులకు వెళ్తూ హోటల్ వద్ద ఆగి టీ తాగుతూ గుండెపోటుతో వెనక్కి కుప్ప కూలాడు. వెంటనే ప్రత్తిపాడు ఆ సుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్ట వైద్యులు తెలిపారు. అతడి మృతితో భార్య గౌరీ, పిల్లలు కన్నీరు మున్నీరయ్యారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

రాజానగరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు పరిధి ఆటోనగర్‌లోని ఒక మెకానిక్ షెడ్డులో గ్రీజు కొడుతుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతిచెందాడు. రాజానగరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన కృష్ణకుమార్ సాకేత్(35) ఆటోనగర్ లోని మెకానిక్ షెడ్డులో 15 ఏళ్లుగా పనిచేస్తున్నాడు. భార్య కుమారుడు, కుమార్తెతో కలిసి రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నారు. సాకేత్ ప్రతిరోజూ ఆటోనగర్‌కు వెళ్తుంటాడు. సోమవారం మెకానిక్ షెడ్డుకు వెళ్లిన సాకేత్ మధ్యాహ్నం 3 గంటల సమయంలో గ్రీజు కొడుతుండగా ప్రమాదవశాత్తూ ఎలక్ట్రికల్ షాక్ గురై స్పృహ కోల్పోయాడు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెకానిక్ షెడ్డులో సూపర్ వైజర్ బిక్రమ్‌సింగ్ ప్రమాద విషయాన్ని సాకేత్ భార్యకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. చికిత్స పొందుతూ సాకేత్ మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ ఎస్.ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

గండేపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామం అంబేడ్కర్ సెంటర్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. గుర్తుతెలియని వృద్ధురాలు ఆదివారం రోడ్డుపై నడుచుకుని వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఆమెకు బలమైన గాయాలు కావడంతో వెంటనే స్థానికులు పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. ఆమె గత కొంతకాలంగా మురారి పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేసుకుంటూ తిరుగుతున్నట్టు మురారి వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు గండేపల్లి ఎస్‌ఐ యువి శివనాగబాబు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిస్తే 9440 904841కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మాజీ క్రికెటర్ కన్నుమూత

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన మాజీ రంజీ ట్రోఫీ క్రికెటర్ ఎస్.సత్యదేవ్ (84) శనివారం రాత్రి కాకినాడలో అనారోగ్య సమస్యల కారణంగా కన్నుమూశారు. సత్యదేవ్ ఆల్‌రౌండర్. లెగ్ స్పిన్‌తో పాటు గూగ్లీ బౌలింగ్ చేసేవారు. 1964-65 సీజన్‌లో విశాఖపట్నం, హైదరాబాద్‌లో జరిగిన రంజీ మ్యాచ్‌లో అరంగేట్రం చేశారు. 1968-69 సీజన్‌లో తిరుచ్చిలో మద్రాస్ (తమిళనాడు)తో జరిగిన చివరి మ్యాచ్ ఆడారు. సత్యదేవ్ 16 మ్యాచ్‌లు ఆడి 503 పరుగులు చేశారు. ఒక సెంచరీ కూడా ఉంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి అధికారిగా పదవీ విరమణ చేశారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సానా సతీష్‌బాబు, తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ నక్కా వెంకటేష్ ప్రగాఢ సంతాపం తెలిపారు.

హుండీలు, మోటార్‌సైకిళ్ల చోరీ

నిందితుడికి మూడేళ్ల జైలు, జరిమానా

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామంలోని పలు ఆలయాల్లోని హుండీలు, మోటార్ సైకిళ్లు చోరీ చేసిన నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ ప్రవీణ్‌కుమార్ సోమవారం తీర్పు వెలువరించినట్టు ఎస్‌ఐ హరీష్‌కుమార్ తెలిపారు. 2024 జూలై 23న టేకిలో జరిగిన చోరీ ఘటనలపై అప్పటి ఎస్‌ఐ పరదేశి కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో కె.గంగవరం మండలం తామరపల్లి గ్రామానికి చెందిన రేవు శ్రీనివాస్ అలియాస్ తాడే శ్రీనివాస్‌కు ఒక్కొక్క కేసులో మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానాతో పాటు జరిమానా కట్టకపోతే అదనంగా 3 నెలల వరకు జైలుశిక్ష విధించినట్టు తీర్పు చెప్పారని పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ విల్ల శ్రీరాములు ఫిర్యాదుదారుల తరుపున వాదించినట్టు ఎస్‌ఐ హరీష్‌కుమార్ తెలిపారు.

ఒమ్మంగిలో చోరీ

నగదు, వెండి, బంగారం మాయం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో రూ.లక్ష నగదుతో పాటు వెండి, బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. దీనికి సంబంధించి బాధితురాలు గుండ్రపు గని లక్ష్మి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన ఇంట్లోని బీరువా తెరిచి ఇంటి నిర్మాణం నిమిత్తం తీసుకున్న లోన్‌లో రూ.లక్ష నగదుతో పాటు విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు దుండగులు చోరీ చేశారని ఎస్‌ఐ లక్ష్మీకాంతం వద్ద వాపోయింది. ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీఎల్‌పీవో కార్యాలయ ఏవోపై విచారణకు డీఆర్వో ఆదేశం

ఎస్సీ, బీసీ ఉద్యోగులపై తప్పుడు గ్రీవెన్స్ ఫిర్యాదులు చేయిస్తూ డబ్బులు డిమాండ్

విచారణ అధికారిగా సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ డీడీ శోభారాణి నియామకం

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో జిల్లా పంచాయతీ శాఖలో పనిచేస్తున్న పలువురు ఎస్సీ, బీసీ ఉద్యోగులపై తప్పుడు గ్రీవెన్స్ ఫిర్యాదులు చేయిస్తూ ఆ ఫిర్యాదులు క్లోజ్ చేయడానికి సదరు ఉద్యోగుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలపై కాకినాడ డీఎల్‌పీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఏవో సీహెచ్ వెంకటరెడ్డిపై వచ్చిన ఫిర్యాదుపై డీఆర్వో జె.వెంకట్రావు విచారణకు ఆదేశించారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కోఆర్డినేటర్ పి.చంగలరావు ఆధ్వర్యంలో పలు దళిత గిరిజన సంఘాల నాయకులు ఈ విషయంపై సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. చంగలరావు మాట్లాడుతూ యు.కొత్తపల్లి మండలం పొన్నాడ గ్రామ పంచాయతీకి సుమారు 3 నెలల క్రితం సియోన్ కుమార్ అనే ఎస్సీ కులానికి చెందిన పంచాయతీ కార్యదర్శిని ట్రాన్స్‌ఫర్ ద్వారా నియమించడం జరిగిందన్నారు. అతను తమకు తెలిసినంత వరకు ఎంతో బాధ్యతగా పంచాయతీ శాఖ నిబంధనలకు లోబడి విధులను నిర్వహిస్తున్నాడన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పంచాయతీ సేవలను అందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో పొన్నాడ పంచాయతీకి సంబంధంలేని నాగులాపల్లి, కొండెవరం పంచాయతీలకు చెందిన బిళ్లకుర్తి రామేశ్వరరెడ్డి, వాసంశెట్టి శ్రీను అకారణంగా అసత్య ఆరోపణలతో తరచుగా జిల్లా కలెక్టర్‌కి పీజీఆర్ఎస్‌లో సియోన్‌కుమార్‌ను బదిలీ చేయాలని ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై సియోన్‌కుమార్‌ను అడగ్గా తనకు ఏ సమాచారం లేదని వారెవరో ఎందుకు ఫిర్యాదు చేస్తున్నారో తెలియదని చెప్పాడన్నారు. దీనిపై కొంచెం లోతుగా సమాచారం సేకరించగా కాకినాడ డీఎల్‌పీవో ఆఫీసులో ప్రస్తుతం ఏవోగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ వెంకటరెడ్డి ఇద్దరితో ఫిర్యాదు చేయించాడని తెలిసిందన్నారు. గతంలో కూడా వెంకటరెడ్డిపై అనేక అవినీతి ఆరోపణలు, నిధుల దుర్వినియోగంపై సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. 12వ ఆర్థిక సంఘం నిధుల తాలూకా వడ్డీని తన ఖాతాకు మళ్లించుకున్నాడని, అతడి సర్వీసులో ఉండగా చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు తిరిగి ఉద్యోగం ఇప్పించే విషయంలో బెనిఫిట్స్ ఇచ్చే విషయంలో మహిళలను కావాలనే ఉద్దేశపూర్వకంగా తన చుట్టూ తిప్పుకుంటూ నచ్చినవారిపై లైంగిక వేధింపులు కూడా చేస్తుంటాడని తెలిసిందన్నారు. ఎస్సీ, బీసీ ఉద్యోగులను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటారన్నారు. సీహెచ్ వెంకటరెడ్డి, అతడి అనుచరులు బిళ్లకుర్తి రామేశ్వరెడ్డి, వాసంశెట్టి శ్రీనివాస్‌లపై డిపార్టుమెంటల్ ఎంక్వైరీ జరిపించాలన్నారు. వెంకటరెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై డీఆర్వో జె.వెంకటరావుకు విజ్ఞప్తి చేయడంతో స్పందించిన ఆయన సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణిని విచారణ అధికారిణిగా నియమించారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, జై భీమ్‌రావు భారత్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాత సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి

లోతట్టు ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలి : చింతూరు ఐటీడీఏ పీవో


చింతూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి క్రమంగా పెరుగుతోంది సోమవారం రాత్రి 7 గంటలకు భద్రాచలం వద్ద 39.60 అడుగుల మేర ప్రవహిస్తోంది. ఈ క్రమంలో చింతూరు మండలం, చింతూరు వరరామచంద్రపురం మండలాల నడుమ సోకిలేరు వాగు మీద ఉన్న వంతెనను ఆనుకుని ఎగపోటు వరద ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ ప్రకటన విడుదల చేశారు. లోతట్టు ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని, ఐటీడీఏలో వరద కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం కూనవరం మండలం, కొండ్రాజుపేట, టేకులబోరుల నడుమ రహదారిపై వరద నీరు చేరిందని, జాలర్లు చేపల వేటకు వెళ్లవద్దని పీవో పేర్కొన్నారు.

అర్ధరాత్రి హాహాకారాలు..!

పెట్రోల్, డీజిల్‌తో ఫ్లాట్‌కి నిప్పుపెట్టిన వైనం

ఆర్తనాదాలతో ప్రాణాలతో బయటపడిన కుటుంబ సభ్యులు

కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలో ఘటన



ఫ్లాట్‌లో దగ్ధమైన ఫర్నీచర్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలో దారుణం జరిగింది. పెట్రోలు, డీజిల్ పోసి ఫ్లాటుకి నిప్పు పెట్టడమే కాకుండా ఇంట్లో ఉన్న వారిని అగ్నికి ఆహుతి చేసేందుకు యత్నించిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఈ ఉదంతంపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంచలనం రేకెత్తింది. వ్యక్తిగత కక్ష, ఆర్థిక లావాదేవీలే కారణంగా పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. వివరాల్లో కెళితే కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట మండల పరిషత్ కార్యాలయం సమీపంలో గల గోపీకృష్ణా రెసిడెన్సీలో మెకానిక్ పిల్లి సత్తిబాబు, భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు నివసిస్తున్నారు. వారంతా భోజనం చేసి ఆదివారం రాత్రి 12 గంటల తర్వాత పడుకున్నారు. సుమారు అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో గదిలో నుంచి పెట్రోలు, డీజిల్ వాసన రావడం, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందిగా ఉండడంతో మెలుకువ వచ్చి సత్తిబాబు లేచి పరిశీలించగా, పెట్రోలు, డీజిల్ వాసనతో పాటూ మంటలు రావడాన్ని గుర్తించి కుటుంబ సభ్యులను లేపి తలుపులు తీసేందుకు ప్రయత్నించాడు. మంటలతో వీరి హాహాకారాలను గుర్తించిన సమీపం ఫ్లాట్స్ వాసులు వచ్చి ఇంటి తలుపులు, అద్దాలు బద్దలు కొట్టి అతికష్టంపై సత్తిబాబు, భార్య దుర్గ, బాలికలు సృజన, భానుచంద్రిక, ఆరేళ్ల మణికార్తిక్‌ను బయటకు ప్రాణాలతో తీసుకురాగలిగారు. మంటల్లో గదుల్లో ఉన్న ఫర్నీచర్, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంపై స్థానికులు ఫైర్ అధికారులకు సమాచారం ఇవ్వగా హుటాహుటిన అగ్నిమాపక వాహనంపై సిబ్బంది వచ్చి మంటలను ఆర్పగలగడంతో పక్క పోర్షన్లకు పెను ప్రమాదం తప్పింది. గ్యాస్ సిలిండర్ పేలి ఉంటే మరింత ప్రమాదం వాటిల్లి ఉండేది. తాము నివసిస్తోన్న అపార్టుమెంట్ పెంట హౌస్‌లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ బాధితుడు పిల్లి సత్తిబాబు సర్పవరం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. సర్పవరం సీఐ బి.గోవిందరాజు ఆదేశాల మేరకు ఎస్‌ఐ శ్రీనివాస్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు ఇచ్చిన సమాచారం మేరకు సదరు వ్యక్తితో వ్యక్తిగత, ఆర్థిక లావాదేవీలపై పలుసార్లు తగాదాలు పడినట్ట భావిస్తున్నామన్నారు. పలు కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇంతటి దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా పోలీసులు అపార్టుమెంట్ పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టారు. ఈ ఘటనతో ప్రజలంతా తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

కడియం-జేగురుపాడు రహదారి శంకుస్థాపనలో ఎమ్మెల్యే గోరంట్ల


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నాణ్యత విషయంలో రాజీ పడొద్దని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రూ.2.66 కోట్ల నాబార్డు నిధులతో చేపట్టే కడియం-జేగురుపాడు రోడ్డు నిర్మాణానికి ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ మండలంలో కడియం, దామిరెడ్డిపల్లి, కడియపులంక గ్రామాల్లో కోట్ల రూపాయలతో రోడ్లు నిర్మించామని, పొట్టిలంక-దుళ్ల రోడ్డు నిర్మాణంతో పాటు కడియపుసావరం-మాధవరాయుడుపాలెం వరకు సీసీ రోడ్డుగా మార్పు చేయించే విధంగా ప్రణాళికలు చేస్తున్నామన్నారు. ఆక్రమణల వల్ల డ్రైనేజీ సమస్యతో పాటు నీరు పోయే మార్గం లేక రహదారులు పాడవుతున్నాయన్నారు. కేంద్రం నుంచి రావాల్సి నిధుల మంజూరును బట్టి అభివృద్ధి పనులు చేస్తామని గోరంట్ల అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, సర్పంచ్‌లు అన్నందేవుల చంటి, చెక్కపల్లి మురళి, టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, వైస్ ఎంపీపీ పంతం గణపతి, ప్రత్తిపాటి రామారావుచౌదరి, కడియపులంక, మురమండ సొసైటీ చైర్మన్లు గట్టి నర్సయ్య, వట్టికూటి దత్తుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయడం దారుణం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించడంలో అత్యంత ప్రాధాన్యమైన వైద్య విద్యను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దారుణమని, క్షమించరాని నేరమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలవరం, అమరావతి రెండు కళ్లు అని చెప్పి నేడు పోలవరం విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రాజెక్టు నిర్మాణం చేయడంలో, నిర్వాసితులకు న్యాయం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ దోబూచులాడుతున్నాయని అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించుకోవడానికి మరోసారి త్యాగాలు చేసేందుకు సిద్ధమని అన్నారు. రైతులు నెలరోజులుగా యూరియా కోసం గగ్గోలు పెడుతున్నా దొరకడంలేదని, దళారులు మాత్రం బ్లాక్‌మార్కెట్‌కు పాల్పడుతూ లాభాలు ఆర్జిస్తున్నారని విమర్శించారు. 21వ తేదీ నుంచి చండీఘడ్‌లో జరిగే సీపీఐ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పార్టీ పోటీ చేస్తుందని, దీనిపై ఇతర వామపక్ష పార్టీలతో సంప్రదిస్తామని అన్నారు. నగర కార్యదర్శి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

మంచి, చెడు స్పర్శలపై అవగాహన ఉండాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మంచి, చెడు స్పర్శలపై పిల్లలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఆమె బాలికా సదనం, ఏకలవ్య బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకొని కొందరు వారిపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.మోసపూరితంగా వాళ్లను అక్రమ కార్యకలాపాలకు వాడుకుంటున్నారన్నారు. పిల్లల పట్ల ఎవరు హద్దులు దాటి ప్రవర్తించినా శిక్షార్హులని ఆమె స్పష్టం చేశారు.వసతి పొందుతున్న పిల్లలకు సురక్షిత తాగునీరు, పౌష్టిక, నాణ్యమైన ఆహారం అందించడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు.పిల్లల హక్కులను పరిరక్షించడానికి డీఎల్ఎస్ఏ నిరంతరం సిద్ధంగా ఉంటుందని, ఏదైనా న్యాయపరమైన అవసరం ఉంటే సంప్రదించాలని ఆమె సూచించారు.

వర్తకులు వృత్తి పన్ను విధిగా చెల్లించాలి

అవగాహన సదస్సులో కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు


సదస్సులో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

రాజానగరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వర్తకులు విధిగా వృత్తి పన్నులు చెల్లించాలని కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ ఏవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాజానగరంలోని వర్తకులకు సోమవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ చాలా మంది వర్తకులు జీఎస్టీకి, వృత్తి పన్నుకు సంబంధం ఉందని,జీఎస్టీ ఉన్నవారు మాత్రమే వృత్తిపన్ను చెల్లించాలనుకుంటున్నారని, ఈ రెండింటికి సంబంధం లేదని స్పష్టం చేశారు. రూ.50 లక్షలు లోబడి,రూ.10 లక్షలు పైబడి టర్నోవర్ చేసే వర్తకులు ఏడాదికి రూ.1250, అలాగే రూ.50 లక్షలు పైబడి వ్యాపార లావాదేవీలు కొనసాగించే వర్తకులు రూ.2500 వృత్తి పన్నులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.వర్తకులు ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా చెల్లించుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఈ విధానంలో ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే తమ కార్యాలయ అధికారులను సంప్రదించవచ్చన్నారు. ఈ సందర్భంగా నూతనంగా వ్యాపారాలు ప్రారంభించిన వర్తకుల నుంచి వృత్తిపన్నులు స్వీకరించి రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ సదస్సులో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సురేష్‌కుమార్, ఛాంబర్ అధ్యక్షుడు కంకటాల సత్తిపండు, ఉపాధ్యక్షుడు లంక శ్రీనివాస్, సముద్రాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వస్థ నారీ స్వశక్తి పరివార్‌పై అవగాహన


పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు

సీతానగరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో స్వస్థ నారీ స్వశక్తి పరివార్ కార్యక్రమం ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వరకు నిర్వహించడంపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ఏవీకె చైతన్య, డాక్టర్ ఈ.ఏసు రాణి ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వరకు ప్రతి గ్రామంలోను స్త్రీలకు, పిల్లలకు క్యాన్సర్, స్క్రీనింగ్, మధుమేహం, రక్తహీనత, క్షయ పరీక్షలు గర్భిణులకు,బాలింతలకు ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్, సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్ష, పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు ఆరోగ్య సిబ్బందితో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అలాగే అక్టోబరు 11న ప్రపంచ బాలిక దినోత్సవం సందర్భంగా ఈ నెల 17 నుంచి క్షేత్రస్థాయిలో బాలికల రక్షణ, వారి ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. అనంతరం తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో మూర్తి స్వస్థ నారీ స్వశక్తి పరివార్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో యర్రా సుబ్బారాయుడు,పీహెచ్ఎన్ లక్ష్మి, సుధాకర్, పెదలక్ష్మి పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులు బయోమెట్రిక్ పూర్తి చేయాలి

జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎండీ గయాజుద్దీన్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్, ఆపై చదువులు అభ్యసిస్తున్న పోస్టుమెట్రిక్ కళాశాల విద్యార్థులు ఉపకార వేతనాలు పొందడానికి తక్షణమే కళాశాలలో బయోమెట్రిక్ వేసి ప్రిన్సిపాల్ ఏటీఏ పూర్తి చేయాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎండీ గయాజుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి జిల్లాలో మొత్తం 25,592 మంది రెన్యువల్ విద్యార్థులకు 19,549 మంది రెన్యువల్ చేసుకున్నారని, ఇంకా 6,043 మంది రెన్యువల్ చేయాల్సి ఉందని తెలిపారు. వీరిలో 4,707 మంది విద్యార్థులకు కళాశాలలో బయోమెట్రిక్ పెండింగ్‌లో ఉదని, విద్యార్థులు వెంటనే గ్రామ/వార్డు సచివాలయాల్లో 5 స్టెప్ వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే, ఫ్రెష్ రిజిస్ట్రేషన్లు, ప్రిన్సిపాల్ లాగిన్స్‌లో బయోమెట్రిక్, ఏటీఏ, విద్యార్థుల హాజరు నమోదు వంటివన్నీ ఈనెల 30వ తేదీలోపు పూర్తిచేయాలని ఆయన స్పష్టం చేశారు.

నగరపాలక సంస్థ పీజీఆర్ఎస్‌కు 21 అర్జీలు

అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో 21 అర్జీలు స్వీకరించినట్టు అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ తెలిపారు. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ విభాగానికి 1, టౌన్ ప్లానింగ్‌కు 5, ఇంజనీరింగ్‌కు 10, సచివాలయాలకు 3, పబ్లిక్ హెల్త్‌కు 1, మెప్మాకి 1, అర్జీ వచ్చిందన్నారు. అర్జీలను ప్రణాళిక బద్ధంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్‌వో వినూత్న, ఎస్ఈ ఇన్‌చార్జి రీటా, మేనేజరు ఎండీ అబ్దుల్ మాలిక్, ఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ధవళేశ్వరంలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఇరిగేషన్ ఇంజనీర్లు

మోక్షగుండం.. నోబుల్ ఇంజనీర్

- ఇరిగేషన్ ఎస్ఈ గోపినాథ్
- ఘనంగా ఇంజనీర్స్ డే
- విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి

ధవళేశ్వం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల రంగంలో విశేష కృషి చేసిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశాభివృద్ధికి దారి చూపిన నోబుల్ ఇంజనీర్ అని ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె.గోపినాథ్ కొనియాడారు. గోదావరిపై ఆనకట్ట నిర్మాణంలో విశేష సేవలందించిన నోబుల్ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజనీర్లు ఘనంగా నిర్వహించారు. నీటి పారుదల శాఖ కార్యాలయాల వద్ద పార్కులో ఉన్న విశ్వేశ్వరయ్య విగ్రహానికి సోమవారం ఉదయం ఎస్ఈ గోపినాథ్ ఇంజనీర్లతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణరాజ సాగర్ డ్యాం నిర్మాణంలో తన ప్రతిభను చాటడంతో పాటు ఆటోమేటిక్ స్లూయిజ్ గేట్ల రూపకల్పనతో వ్యవసాయానికి అనుకూలంగా నీటి నియంత్రణ సాధ్యమయ్యేలా ఆయన కృషి చేశారని పేర్కొన్నారు. నేటి ఇంజనీర్లు ఆయన బాటలో రాష్ట్ర దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌వర్క్స్ ఈఈ జి.శ్రీనివాసరావు, డీఈ ఆనంద్‌కుమార్, ఏఈలు విశ్వనాధరాజు, మణికంఠరాజు, సునీల్, జేఈ రాధాకృష్ణ తదితర ఇంజనీర్లు పాల్గొన్నారు.

రాజానగరం: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని సందర్భంగా గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ) ప్రాంగణంలో నిర్వహించిన మేధా సాంకేతిక ఉత్సవాన్ని కులపతి చైతన్యరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. దీనిలో భాగంగా విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధ (ఏఐ)మన జీవితాల్లో అనేక అంశాలను మార్చగల సామర్థ్యం సంతరించుకుందన్నారు. సమాజాభివృద్ధిలో ఇంజనీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఏ సౌకర్యాలు లేని కాలంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చూపిన దీర్ఘదృష్టి, దేశానికి అందించిన విశేష సేవలు నేటి యువ ఇంజనీర్లకు స్ఫూర్తిదాయక మన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లోని చోటుచేసుకుంటున్న విప్లవాత్మక మార్పులను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రొ వైస్ ఛాన్సలర్ కేవీబీరాజు, రిజిస్ట్రార్ పీఎం ఎంఎస్ శర్మ, మేధ కన్వీనర్ వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


రాజానగరం: జీజీయూలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైతన్యరాజు


రాజమహేంద్రిలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులు

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక రాజమహేంద్రి మహిళా కళాశాలలో ఆంధ్ర కేసరి యువజన సమితి పూర్వ అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రముఖ ఇంజనీర్ టీకే విశ్వేశ్వరరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో మాదిరెజు శ్రీనివాస్,కాకర్ల పవన్‌కుమార్, దుర్వాసుల సత్యనారాయణ పాల్గొన్నారు.

అనపర్తి: రామవరంలో మండలంలోని ఇంజనీరింగ్ అధికారులతో కలిసి నిర్వహించిన ఇంజనీర్స్ డేలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగు, సాగునీటి ప్రాజెక్టులతో నవభారత నిర్మాణానికి సేవలందించిన విశ్వేశ్వరయ్యను ప్రతి ఇంజనీరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రస్తుత సమాజంలో ఇంజనీర్లు తాము చేసే ప్రతి ప్రాజెక్టు భావితరాలకు సేవలందించే విధంగా ఉండాలన్నారు.

సేంద్రీయ పంటలతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రకృతి వ్యవసాయాధికారుల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సేంద్రీయ పద్ధతుల్లో పండించిన కూరగాయలు, పండ్లు, ఆకు కూరలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందితో ఆయన సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని 12,572 ఎకరాల్లో 10,906 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. వీరిలో 11,241 ఎకరాల్లో 9,721 మంది రైతులు పాక్షికంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్నారన్నారు. పూర్తి స్థాయిలో 914 ఎకరాల్లో 823 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయంలో వస్తున్న నూతన సాంకేతిక పద్ధతులను తెలియజేసేందుకు నియోజకవర్గ పరిధిలో 33 మంది సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. రైతులు సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది సూచనలు, సలహాలు అందించాలన్నారు.

108 అంబులెన్స్ ప్రారంభం

ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు సకాలంలో అందించేందుకు మంజూరైన 108 కొత్త వాహనాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సోమవారం జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అత్యవసర సమయంలో వైద్య సేవలందించేందుకు అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన అంబులెన్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేఏ ఝాన్సీ, తహశీల్దార్ జీఏఎల్ సత్యవతి దేవి, పీహెచ్ వైద్యాధికారి డాక్టర్ గట్టి రామభాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు



రంగంపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపారు. మండలంలోని వడిశలేరు గ్రామానికి చెందిన 21 ఏళ్ల గోళ్ల మాలతి ఈ నెల 14న మధ్యాహ్నం 12 గంటల సమయంలో చర్చికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో యువతి తల్లి లిల్లీ చర్చి దగ్గరకు వెళ్లి అడుగగా అక్కడికి రానట్టు చెప్పారు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ఆమె సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. యువతి ఆచూకీ తెలిసి వారు ఎస్.ఐ 9440904854, సీఐ 9440796538 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

మిథున్ త్వరలోనే నిర్దోషిగా బయటకు వస్తారు

వైసీపీ ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వైసీపీ నేతలను అక్రమంగా అరెస్టు చేస్తోందని, మిథున్‌రెడ్డి త్వరలోనే నిర్దోషిగా బయటకు వస్తారని రాజంపేట ఎమ్మెల్యే(వైసీపీ) అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సెంట్రల్ జైల్లో రిమాండు ఖైదీగా ఉన్న మిథున్‌ని సోమవారం అమర్‌నాథ్, రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, కోడూరు మాజీ ఎమ్మెల్యే కోరముట్ల శ్రీనివాసులు ములాఖత్ ద్వారా కలిశారు. అనంతరం అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ మిథున్‌ని అరెస్టు చేసి ఆయన తల్లిదండ్రులకు ఆవేదనకు గురి చేస్తున్నారన్నారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మంత్రివర్గ సమావేశంలో చెప్పిన సూక్తులను ఆయన మాత్రం పాటించరన్నారు. ఆయన సీఎం అయిన ఈ 15 నెలల్లో రాష్ట్రంలో అరాచకం పెరిగిపోయిందన్నారు.గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఎక్కువ హత్యలు జరిగాయని ఆరోపించారు. ఆయన కల్లబొల్లి కబుర్లు మాత్రమే చెబుతారన్నారు. శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ భారత రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. కూటమి నేతలు చెప్పేవి శ్రీరంగ నీతులు చేసేవి తప్పుడు పనులన్నారు. దేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడు జగన్ అని పేర్కొన్నారు. న్యాయస్థానాలపై తమకు నమ్మకం ఉందన్నారు. మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ చంద్రబాబు శెట్టిబలిజ కులాలకు క్షమాపణ చెప్పాలన్నారు.వారి మనోభావాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. ప్రతి కులాన్ని గౌరవించాలనేది వైసీపీ అభిప్రాయమని చెప్పారు. జీవోకి మెమోకి వ్యత్యాసం తెలియని వ్యక్తులు కేబినెట్లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు షర్మిలారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రాజమహేంద్రవరంలో మెడికల్ కళాశాలను తమ హయాంలో ఏర్పాటు చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వైసీపీ నాయకులంతా మెడికల్ కళాశాల వద్దకు చేరుకొని లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదానికి దిగారు. ప్రజాస్వామ్యంలో ఉన్నామని, లోపలికి ఎందుకు వెళ్లకూడదని ప్రశ్నించారు. పోలీసులు అనుమతి నిరాకరించడంతో కళాశాల గేటు వద్ద ఒక స్కూటర్‌పై కేకు ఉంచి కట్ చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్‌కు అనుకూలంగా పెద్దగా నినాదాలు చేశారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం: బీవీఆర్


జిల్లా ఉత్తమోపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

కోరుకొండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యా రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి అన్నారు. ఇటీవల మండలం నుంచి ఐదుగురు జిల్లా ఉత్తమోపాధ్యాయ అవార్డులు అందుకున్న సందర్భంగా సోమవారం సాయంత్రం కోరుకొండ ఆదిత్య ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎంఈవో టి.కుశలవ దొర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉత్తమోపాధ్యాయ అవార్డులు అందుకున్న ఐదుగురితోపాటు మండల ఉత్తమోపాధ్యాయ అవార్డులు అందుకున్న ఎనిమిది మంది ఘనంగా సత్కరించారు. వారికి మెమెంటోలు అందజేశారు.అలాగే ఉత్తమ డ్రాయింగ్ మాస్టారు, ఉత్తమ ఎంఎస్ కోఆర్డినేటర్, ఉత్తమ సీఆర్పీ, ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్ అవార్డులను పవలువురికి అందజేశారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు, పెందుర్తి అబిరాం, అడపా వీరబాబు,దూది కాంతారావు, బీజేపీ నాయకుడు అడపా సుధీర్‌కుమార్, ఎంఈవో ఎం.సుజాత, యూటీఎఫ్ నాయకులు భగవాన్, వీర శివబాబు, పీఆర్టీయూ నాయకులు ఎస్.రాజారావు, మట్టా శివనారాయణ, సాదే రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి న్యాయం జరిగే వరకూ పోరాటం

కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గోకవరంలో అత్యాచారానికి గురైన బాలికకు న్యాయం చేయాలని, అప్పటి వరకు తాము పోరాటం చేస్తామని, ఈ సంఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఏపీ రైతు కూలీ సంఘం, ప్రగతి శీల మహిళా సంఘం(స్త్రీవిముక్తి), ఏఐఎస్‌టీయూ, పీడీఎస్‌యూ(వి)ల సంయుక్త ఆధ్వర్యంలో భారీ నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ వారం రోజుల క్రితం గోకవరంలో జరిగిన అత్యాచారం ఘటనపై పోలీసులు చాలా నిర్లక్ష్యం చూపిస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటన జరిగి వారమైనా తహశీల్దార్ బాధిత బాలికను పరామర్శించలేదన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణలేదని గొంతెత్తిన ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఇప్పుడు అధికారంలో ఉండగా రాష్ట్రంలో మహిళలు,బాలికలపై జరుగుతున్న దారుణాలపై కనీసం స్పందించడంలేదన్నారు. గోకవరం ఘటనపై ప్రభుత్వం స్పందించాలని నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు బాలికకు రెండెకరాల భూమి, ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించే లక్ష్యంతో నాయకులు పని చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రామవరంలో జరిగిన కూటమి నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామ స్థాయిలో కూటమి పార్టీల్లో తలెత్తే చిన్న చిన్న సమస్యలను పరిష్కరించేందుకు గ్రామాల వారీ నాయకులు కమిటీలుగా ఏర్పడాలని, వాటిని విజయదశమి లోపు పరిష్కరించే దిశగా మూడు పార్టీల నాయకులు ముందుకు సాగాలన్నారు. సమావేశంలో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, జుత్తుగ సూర్యకుమారి, రావాడ నాగు, పుట్టా గంగాధర చౌదరి, నాలుగు మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఏపీ రిటైర్డ్ ఎంప్లాయీస్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):స్థానిక లాలాచెరువు హౌసింగ్ బోర్డులో ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాజమండ్రి యూనిట్ కార్యవర్గం ఎన్నిక జరిగింది. ప్రెసిడెంట్‌గా పల్లా సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్స్‌గా బీవీ సూర్యనారాయణ మూర్తి, మాహూరి బాబురావు, జనరల్ సెక్రటరీగా వి.పీటర్‌సన్, కోశాధికారిగా పెయ్యల సత్యప్రసాద్, వైస్ ప్రెసిడెంట్స్‌గా నూలు వెంకటేశ్వరరావు, డి.సూరారెడ్డి, కెసాయిరాం, పీవీవీ సుబ్రహ్మణ్యం, సెక్రటరీలుగా వి.దుర్గా ప్రసాద్, బీఏ ఆంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అద్దంకి సుబ్బారావు, జిల్లా ఈసీ మెంబరుగా పెసల సత్యప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎలక్షన్స్ ఆఫీసర్స్‌గా దువ్వూరి కామేశ్వర శర్మ, యర్రమోతు ధర్మరాజు వ్యవహరించారు. కార్యక్రమంలో పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫైలేరియా సర్వే తనిఖీ


కడియం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): లింఫాటిక్ ఫైలేరియాసిస్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వ్యాధి వ్యాప్తక అంచనా సర్వేని సోమవారం కడియం ఆదిత్య ప్రైవేటు పాఠశాలలో నిర్వహించారు. సెంట్రల్ మలేరియా ల్యాబ్ నుంచి వచ్చిన రాష్ట్ర మలేరియా సహాయ అధికారి ఎం.పార్వతీశం తనిఖీ చేశారు. 1, 2 తరగతుల విద్యార్థులు 95 మందికి రక్తపూతల సేకరించి పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారి డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న తెలిపారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి పి.శ్రీహరి, లాబ్ టెక్నీషియన్ జె.జగదీష్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కోరుకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద సోమవారం రాత్రి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్ ఆధ్వర్యంలో కొండపైన, దిగువన కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. అలాగే హరేరామ సమాజం వద్ద ఆలయ అధ్యక్షుడు కపిలవాయి నమఃశివాయ శర్మ, ఆలయ ప్రధానార్చకు మిరియాల శేషు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి జరిపారు. సత్యవతి ఆధ్వర్యంలో మహిళలు తిరువాయ పారాయణ, ద్వాదశ హారతులు, నివేదనలు సమర్పించారు.

భారీ అన్నసమారాధన

సీతానగరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక లంకూరులో శ్రీరామదుర్గా వడ్డీల యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గంగాలమ్మ తెప్పోత్సవం నిర్వహించారు.సోమవారం భారీ అన్నదానం జరిపారు.





స్వస్థ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ ప్రచార పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఆర్‌వో, డీఎంహెచ్‌వో తదితరులు

ఆ పాఠశాలకు.. ఆ నలుగురే!

శంకరాపురంలో పాఠశాలలో ఒక టీచర్.. రెండు తరగతులు.. నలుగురు విద్యార్థులు

నిడదవోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నిర్వహణ చూస్తే బారెడు.. హాజరు చూస్తే మూరెడు.. ఆ పాఠశాలను చూసిన వారెవరైనా ఆ మాట అనకమానరు. ఎందుకంటే ఒక ఉపాధ్యాయుడు..రెండు తరగతులు.. నలుగురే విద్యార్థులు..అయినా పాఠశాల నడిచిపోతోంది.. ఇదెక్కడో మారుమూల కాదండోయ్.. నిడదవోలు మండలం శంకరాపురం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో.. ఇక్కడ 1,2 తరగతులు మాత్రమే కొనసాగుతున్నాయి.రికార్డుల్లో మాత్రం 10 మంది విద్యార్థులు అని చూపెడుతూ ఈ పాఠశాలను నడిపించేస్తున్నా విద్యాశాఖాధి కారులు దృష్టి పెట్టడం లేదు. ఆ బడికి అన్నీ ఆ మాస్టారే కావడంతో ఆయన పాఠశాలకు ఎప్పుడు వస్తారో..ఎప్పటి వరకూ ఉంటారో ఎప్పుడు వెళతారో ఎవరికి తెలియదు. ఇప్పటికే ఈ పాఠశాలలోని 3,4,5 తరగతులను ఈ ఏడాది కిలోమీటరు దూరంలో ఉన్న రావిమెట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో కలిపేశారు. 1,2 తరగతులకు సంబంధించి 10 మంది విద్యార్థులను రికార్డు పరంగా చూపిస్తున్నారు. ఈ ఎంపీపీ పాఠశాలలో ముగ్గురు ఎంఆర్ విద్యార్థులు కాగా వారు పాఠశాలకు రారు. మిగిలిన ఏడుగురు విద్యార్థుల్లో మరో ఇద్దరు విద్యా ర్థులు ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక పాఠశాలకు వెళ్లిపోయారు. మరొక విద్యార్థి నిడదవోలు పట్టణంలోని సుబ్బరాజు పేటకు వెళ్లిపోయినట్టు సమాచారం.దీంతో గత కొంతకాలంగా నలుగురు విద్యార్థులతోనే ఈ పాఠశాల నడుస్తుంది. ఈ పాఠశాలపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.



నిడదవోలు మండలం శంకరాపురం ఎంపీపీ పాఠశాలలో ఒక టీచర్.. నలుగురు విద్యార్థులు

రేపటి నుంచి మహిళలకు వైద్య శిబిరాలు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్వస్థ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాల ద్వారా ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకూ వైద్యసేవలు అందించనున్నామని డీఆర్‌వో టి.సీతారామమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మహిళలకు అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, రక్తపోటు, మధుమేహం, నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్ పరీక్షలు, క్షయ వ్యాధి స్క్రీనింగ్, పోషణ అభియాన్, తల్లి-బిడ్డ సేవలు, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు, వయోవృద్ధుల ఆరోగ్యసేవలు, మానసిక వైద్య సేవలు, ఆయుష్ వైద్యసేవలు అందించనున్నట్టు తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొంటారన్నారు. జిల్లాలో ధవళేశ్వరం పీహెచ్‌సీలో ఈ నెల 17వ తేదీ ఉదయం ప్రారంభ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీపీవో అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ పీడీగా నాతి బుజ్జి బాధ్యతలు



రాజమహేంద్రవరం,సెప్టెంబరు 15 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నాతి బుజ్జి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో కాకినాడ జిల్లా గండేపల్లి, కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో ఎంపీడీవోగా పనిచేసి బదిలీ అయ్యారు.డీఎల్‌డీవో పదోన్నతిపై ఏలూరు జిల్లా డ్వామా పీడీగా బాధ్యతలు నిర్వహించారు. డిప్యుటేషన్‌పై ఇక్కడకు పీడీగా బదిలీపై వచ్చారు.



బాధితుల గోడు వింటున్న మురళీకృష్ణ

డీపీవోలో 40 అర్జీలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో 40 అర్జీలను అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ స్వీకరించారు. బాధితులతో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



పీజీఆర్ఎస్‌లో ప్రజల సమస్యలు వింటున్న డీఆర్‌వో, డిప్యూటీ కలెక్టర్

పీజీఆర్ఎస్‌లో 152 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):ప్రజాసమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని జిల్లా రెవెన్యూ అధికారి సీతారామమూర్తి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో 152 అర్జీలు ప్రజల నుంచి స్వీకరించారు. అధికారులు ఉద్దేశపూర్వకంగా పరిష్కరించకపోతే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు అర్జీల యధార్థస్థితిని 1100 కాల్‌సెంటర్ ద్వారా లేదా మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. వాట్సప్ గవర్నెన్స్ 95523 00009 ద్వారా పౌరసేవలు పొందే అవకాశం ఉందన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పి.భాగ్యలక్ష్మి, డీఎల్‌డీవో పి. వీణాదేవి, ఏ స్లీవా రెడ్డి, లేబర్ సహాయ కమిషనర్ వలీ, డీపీఆర్‌వో కే.లక్ష్మీనారాయణ, జిల్లా రిజిస్ట్రార్ ఆర్.సత్యనారాయణ, ఏడీ సర్వే బి. లక్ష్మీనారాయణ,డీఈవో కె.వాసుదేవరావు పాల్గొన్నారు.



వాన నీటిలో కోటిపల్లి బస్టాండ్ సెంటర్



ముంచిన వాన..

వాన వస్తే ఒక గొడవ.. రాకపోతే మరో గొడవ.. నిన్నటి వరకూ వానలు లేక ఉక్కబోతతో జనం అల్లాడిపోయారు.. ప్రస్తుతం వానలతో తడిసిముద్దవుతున్నారు.. సోమవారం ఉదయం 10 గంటలకు ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైంది..కాసేపటికే భారీ వాన కురిసింది.. రాజమహేంద్రవరం అంతా ఇలా జలమయమైంది.

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

జిల్లా బాధ్యత కలెక్టర్లదే

కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు నాయుడు

- పెరిగిన జీవీఏ లక్ష్యాలు
- హెచ్ఏ సత్యవేణికి ప్రశంసలు
- టాప్ 5 మండలాల్లో కడియం, బిక్కవోలు, నల్లజర్ల

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) :'దేశంలో ప్రధాని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎంత ప్రాముఖ్యత కలిగిన వ్యక్తులో అదే ప్రాముఖ్యత కలిగిన జిల్లా కలెక్టర్లు, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను పోటీతత్వంతో ముందుకు నడిపించి ప్రభుత్వానికి 'పేరు తీసుకురావాలి' అని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. అమరావతిలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు జరిగే జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆయన ప్రసంగించారు. జిల్లాల అభివృద్ధికి సంబంధించిన ప్లానింగ్, పొలిటికల్ గవర్నెన్స్, పాలసీలు మేనేజ్‌మెంట్‌పై సీఎం సమీక్షించారు. పొలిటికల్ గవర్నెన్స్‌కు సంబంధించి మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు చూసుకుంటారని, జిల్లా ప్లానింగ్‌కు సంబంధించిన బాధ్యత కలెక్టర్లు తీసుకుని నడిపించాలని సూచించారు.తొలిరోజు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు తూర్పుగోదావరి జిల్లా నుంచి చేకూరి కీర్తి హాజరయ్యారు. ప్రభుత్వ ప్రణాళికల్లో భాగంగా యాక్షన్ టేకెన్ రిపోర్టు (ఏటీఆర్)కు సంబంధించి మాట్లాడారు. ఎకనమిక్ గ్రోత్ ప్రొడక్షన్, ఏపీజీఎస్డీపీ టార్గెట్స్, ఎచీవ్‌మెంట్స్‌పై చర్చించారు. కీ పెర్ఫార్మెన్ ఇండికేటర్స్ (కేపీఎల్ఎస్)కు సంబంధించి స్వర్ణాంధ్ర విజన్ మోనటరింగ్ ఫ్రేమ్ వర్కు, స్కోరింగ్ మెథడాలజీ, జిల్లాలు, మండలాల వారీగా సమీక్ష, సాధించిన ర్యాంకులను వివరించారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి బిక్కవోలు మండలం కాపవరం రైతు సేవా కేంద్రానికి చెందిన జె.సత్యవాణి గతేడాది సాధించిన జీవీఏతో ప్రస్తుత ఏడాది లక్ష్యాన్ని బాగా పెట్టుకోవడంతో సమావేశంలో అభినందించారు.జిల్లాలోని బలభద్రపురం, అరికరేవుల రైతు సేవా కేంద్రాలు 1,23వ స్థానాల్లో నిలిచాయి. బిక్కవోలు మండలం కాపవరం గ్రామ వెటర్నరీ అసిస్టెంట్ (ఏహెచ్ఏ) గతేడాది జీవీఏ వసూళ్లు రూ.27.72 కోట్లు. ఈ ఏడాది లక్ష్యం రూ.29.66 కోట్లు. ఆమె గతేడాది రూ.816 కోట్లు జీవీఏ సాధించగా ఈ ఏడాది మరింత ఎక్కువగా రూ.895.14 కోట్లు లక్ష్యంగా పెట్టుకుంది. జీవీఏ సాధనలో రాష్ట్ర స్థాయిలో ముందంజలో నిలిచారు.ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.



సీఎం సమీక్షలో జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి

సాధించాల్సిన లక్ష్యాలు..

- ఇక వివిధ రంగాలలో జీవీఏ లక్ష్యాలు.. ఇంతవరకూ సాధించినవి.. ఇంకా సాధించాల్సిన లక్ష్యంపై నివేదించారు. గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీడీపీ) విషయంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.75,384 కోట్లు జీవీఏ లక్ష్యంకాగా 16.93 శాతం వృద్ధి సాధించాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.13,358 కోట్లు 17.72 శాతం సాధించారు. మిగిలిన మూడు క్వార్టర్లు అంటే 9 నెలల్లో రూ.62,026 కోట్లు 82.28 శాతం సాధించాల్సి ఉంది.
- వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో జిల్లా స్కోర్ 31, గ్రేడ్ సి. ఈ రంగంలో జీవీఏ రూ.28,112 కోట్లు లక్ష్యం అంటే 16.34 శాతం వృద్ధి సాధించాలి. ఇప్పటి వరకూ రూ.3,342 కోట్లు 11.99 శాతం సాధించారు. ఇంకా రూ.24,770 కోట్లు అంటే 88.11 శాతం సాధించాలి. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా టాప్ ఐదు మండలాల్లో బిక్కవోలు, కడియం, నల్లజర్ల మండలాలు ఉండడం గమనార్హం. టాప్ రైతు సేవా కేంద్రాలు (ఆర్ ఎస్‌కే)లలో బలభద్రపురం 1,2,3, ఆరికరేవులకు స్థానం లభించింది.
- టాప్ జిల్లాలో తూర్పుగోదావరి జిల్లా ఉంది. వ్యవసాయరంగంలో 1839, హార్టికల్చర్‌లో 17,993, యానిమల్ హస్బెండరీ రంగంలో 5135 సాధించి మొత్తం రూ.24,966 కోట్ల జీవీఏ సాధించింది.
- జిల్లాలో పారిశ్రామిక జీవీఏ టార్గెట్ రూ.12,461 కోట్లు దీని వృద్ధి రేటు 16.86 శాతం. ఇప్పటి వరకూ సాధించింది రూ.3026 కోట్లు 24.28 శాతం. ఇంకా చేరవలసిన జీవీఏ లక్ష్యం రూ.9,435 కోట్లు. ఇది 75.72 శాతం. పరిశ్రమల రంగంలో జిల్లా స్కోర్ 67గా ఉండగా, గ్రేడ్ -బి లభించింది. రాజమండ్రిలోని వైట్‌ఫీల్డ్‌ను లాండ్ పార్శిల్ సెక్టార్ కింద ప్రతిపాదించారు.సర్వీసు సెక్టార్‌లో జిల్లా స్కోర్ 76 కాగా, ఏ-గ్రేడ్ లభించింది.
- స్వర్ణాంధ్ర పెర్‌ఫార్మెన్స్ ఇండికేటర్లకు స్కోర్ 63, గ్రేడ్ బి లభించాయి.

ఆనందంగా ఉంది



కాపవరం, బలభద్రపురం గ్రామాల్లో వెటర్నరీ అసిస్టెంట్ బాధ్యతలు నిర్వహిస్తున్నా. కాపవరంలోని నాలుగు ఫౌల్ట్రీల్లో సుమారు 4 లక్షలు, బలభద్రపురంలోని ఏడు ఫౌల్ట్రీల్లో సుమారు 20 లక్షల కోళ్లు ఉంటాయి. ఇవి ఆరోగ్యంగా ఉండి గుడ్ల ఉత్పత్తి చేస్తుండడంతో ఆదాయం కారణంగా జీవీఏ పెరిగి రాష్ట్రంలో ముందంజలో ఉండడం ఆనందంగా ఉంది.- **సత్యవేణి, వెటర్నరీ అసిస్టెంట్, కాపవరం**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రూ.5,500 కోట్లు దారి మళ్లించిన జగన్

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కాలేజీల పేరుతో రూ.5500 కోట్లను మాజీ సీఎం జగన్ దారి మళ్లించారని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆరోపించారు.రాజమహేంద్రవరం జేఎన్.రోడ్డులోని సితార హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. గతంలో రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలు నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం వాటాగా రూ.975 కోట్లు ఇచ్చిందని, మళ్లీ దాదాపు రూ.5వేల కోట్లును రాష్ట్ర ప్రభుత్వం అప్పుచేసిందన్నారు. జగన్ హయాంలో రూ.1400 కోట్లతో పనులు చేపట్టగా అవన్నీ పునాది దశ దాటలేదన్నారు. కాంట్రాక్టర్లుకు రూ.670 కోట్లు బకాయిలు పెట్టారన్నారు. ఈ మొత్తంలో రూ.5500 కోట్లు నిధులు జగన్ దారి మళ్లించారని ధ్వజమెత్తారు. చేసిందంతా చేసి ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని మండిపడ్డారు.ప్రైవేటీకరణకు పీపీపీ విధానానికి వ్యత్యాసం తెలియకుండా జగన్ ఐదేళ్ల పాటు ఎలా సీఎంగా ఉన్నారో అర్థం కావడంలేదన్నారు.తాము అధికారంలోకి వచ్చాక టెండర్లలో పాల్గొన్నవాళ్ళ టెండర్లు రద్దు చేస్తామంటూ మెడికల్ కాలేజీల నిర్మాణ కాంట్రాక్టర్లను బెదిరించిన జగన్ జైలు లో ఉండడమే మంచిదన్నారు.ఈ సమావేశంలో ఏపి శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కూటమి నాయకులు కాశి నవీన్ కుమార్, మజ్జి రాం బాబు, వైశ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖాళీ జాగా.. ఇస్తే పోలా!



వాటర్ గ్రిడ్‌కు ఇరిగేషన్ మోకాలడ్డు

- జల్‌జీవన్ మిషన్‌కు అడ్డంకులు
- ధవళేశ్వరంలో స్థలానికి ప్రతిపాదన
- 14 ఎకరాలకు డిమాండ్
- అనుమతించని ఇరిగేషన్ శాఖ
- ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- సీఎంను కలిసే ఆలోచన

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పల్లెపల్లెకు గోదారి నీళ్లు.. ఈ మాట ఎన్నికల సమయంలో వింటూనే ఉంటాం.. ఆ తరువాత మరుగున పడిపోవడం చూస్తూనే ఉంటాం. 2019 ఎన్నికల్లో అయితే వైసీపీ ఇదో ప్రధాన హామీగా ప్రకటించింది.ఆ తరువాత ఐదేళ్ల అధికారంలో ఉన్నా కనీసం పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆరంభించిన పనులు కొనసాగించలేదు. దీంతో పల్లెపల్లెకు గోదావరి నీళ్ల అందకుండాపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో పథ కంపై కదలికి వచ్చింది. జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా పల్లెపల్లెకు గోదావరి నీళ్ల అందించడమే లక్ష్యంగా పనులు సాగుతున్నాయి.

ధవళేశ్వరంలో స్థలం ప్రతిపాదన..

జలజీవన్ మిషన్ పథకానికి సంబంధించి వాటర్ గ్రిడ్ నిర్మాణానికి ధవళేశ్వరంలో ఇరిగేషన్‌కు చెందిన 14 ఎకరాల ఖాళీ స్థలాన్ని ప్రతిపాదించారు. కేంద్రం, రాష్ట్ర భాగస్వామ్యంతో జలజీవన్ మిషన్ పేరిట ఈ పథకం అమలవుతోంది.గ్రిడ్‌కు అవసరమైన స్థలం సేకరణకు పలు చోట్ల ప్రయత్నాలు చేసి ధవళేశ్వరంలో ఇరిగేషన్ భూమిని ప్రతిపాదించారు. గతంలో ఈ భూమిని ఇళ్ల స్థలాలకిచ్చే ప్రయత్నం జరిగింది.కానీ కొందరు అడ్డుకున్నారు.ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఆయా కలెక్టర్ల ద్వారా ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులకు విషయం తెలిపారు.స్పందన లేక సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లే ఆలోచన చేస్తున్నారు.

గ్రామాల్లో సాగుతున్న పనులు

2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం అప్పట్లోనే వాటర్‌గ్రిడ్‌ను ప్రతిపాదించింది.అప్పుడు గ్రామాభివృద్ధిశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ మధురపూడి విమానాశ్రయంలో రూ.1000 కోట్లతో వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించి తర్వాత అంచనా కూడా పెంచారు. ఇదిలా ఉండగా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ధవళేశ్వరం వద్ద గ్రిడ్‌కు సంబంధించి ఏర్పాట్లు చేయడా నికి ప్రయత్నాలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటి సరఫరాకు ప్రణాళిక సిద్ధంచేశారు. పైపులైన్ల ద్వారా ప్రతి ఇంటికి గోదావరి నీటిని అందించాలనేది ఈ పథకం లక్ష్యం. అప్పట్లోనే కొన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో వాటర్‌గ్రిడ్‌ను కొంతకాలం పట్టించుకోలేదు. తర్వాత నెమ్మదిగా పథకం ఆరంభమైనా.. నిధుల మళ్లింపు కారణంగా అన్ని చోట్లా పూర్తి కాలేదు. 2024లో తిరిగి తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో పథకానికి కదలిక వచ్చింది. రూ.1250 కోట్లతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అవసరమైన అన్ని గ్రామాలకు మంచినీరివ్వడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అనేక గ్రామాల్లో పనులు చేస్తున్నారు.

ఇరిగేషన్ స్థలానికి పట్టు..

ధవళేశ్వరంలో 10 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ నిర్మాణానికి స్థలం చూపించినా దానికి అనుమతివ్వడంలేదు.దీంతో ప్రజాప్రతినిధులు ఆగ్రహంగా ఉన్నారు. పైగా ఇక్కడ ఇరిగేషన్ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి.ఇరిగేషన్‌కు ఇంత ఖాళీ స్థలం ఉన్నప్పటికీ వాటర్ గ్రిడ్‌కు ఎందుకివ్వడంలేదనేది పెద్ద సమస్యగా మారింది. జేగురుపాడులో స్థల పరిశీలన చేసినా అది సరిపోదనే కారణంతో ఇరిగేషన్ స్థలం ప్రతిపాదించారు. ఈ గ్రిడ్ నిర్మాణం కాకుండా గ్రామాల్లో పైపులైన్లు వేసినా, ఓహెచ్‌ఆర్‌లు నిర్మించినా ఫలితం ఏముంటుంది.అక్కడ పని పూర్తయ్యే సరికి..ఇక్కడ వాటర్ గ్రిడ్ పూర్తయితేనే ఉమ్మడి జిల్లా ప్రజలకు గోదావరి నీళ్లందుతాయి.

అభ్యుదయ రైతులకు సన్మానం



రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వినియోగంపై అవగాహన అవసరమని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. పీజీఆర్ఎస్ సమావేశం మందిరంలో సోమవారం అభ్యుదయ రైతులు తొర్రేడు గ్రామానికి చెందిన సుంకవల్లి చౌదరి, ఎస్‌వీవీ శ్రీనివాస్, చినకొండేపూడికి చెందిన జి.నాగరాజు, జి. సతీష్‌ను జిల్లా అధికారులు సన్మానించారు. గత రెండు సీజన్లలో రాజమహేంద్రవరం రూరల్, సీతానగరం మండలానికి చెందిన అభ్యుదయ రైతులు నానో ఎరువుల విని యోగం ద్వారా మంచి ఫలితాలు సాధించా రన్నారు. అవసరానికి మించి యూరియా వాడడం వల్ల నేల సహజస్వభావం దెబ్బతిం టుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ,మత్స్య శాఖ అధికారి నిర్మల కుమారి,అధికారులు పాల్గొన్నారు.



నల్లజర్ల మండలం పోతవరం వద్ద గట్లను తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రకాల్వ

ఉధృతంగా ఎర్రకాల్వ

నిడదవోలు/నల్లజర్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎర్రకాలువ ఉధృతంగానే ప్రవహిస్తుంది. కొంగువారుగూడెం నుంచి ప్రవహించే ఎర్రకాల్వ గట్లను తాకుతూ ఉధృతంగా ఉంది.ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో కొంగువారిగూడెం జలాశయం నుంచి 2 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎర్రకాల్వ మరింత ఉధృతంగా మారింది. గట్లను తాకుతూ సుడులు తిరుగుతూ దూకుడుగా మారింది. ఎర్రకాల్వ పరీవాహక గ్రామాలైన పోతినీడుపాలెం, పోతవరం,కవులూరు, నబీపేట, అనంతపల్లి, చోడవరం, గుండేపల్లి గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు గ్రామాలను ఖాళీ చేయమంటారోనని బిక్కు బిక్కుమంటు ఉన్నారు.అనంతపల్లి వద్ద నీటిమట్టం రెండు మీటర్లు మాత్రమే ఉండడంతో కొంత ఊపిరి పీల్చుకుంటున్నారు. అనంతపల్లి వద్ద 3 మీటర్లకు మించి ప్రవహిస్తే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు.నిడదవోలు మండలం కంసాలిపాలెం,తాళ్ళపాలెం, శెట్టిపేట శివారులో సోమవారం కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత ఎర్రకాలువ ఉధృతి ఉన్న ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద బాధిత ప్రాంతాలపై దృష్టి పెట్టాలన్నారు. ఎక్కడైనా ప్రమాదకరంగా ఉంటే ప్రజలను ఆయా గ్రామాలకు కేటాయించిన పునరావాస కేంద్రా లకు తరలించాలని ఆదేశించారు. ఆమె వెంట తహశీల్దార్ నాగరాజు నాయక్, ఎంపీడీవో జగన్నాథరావు, గ్రామాధికారులు ఉన్నారు.

రణభేరి పోస్టర్ విడుదల

నల్లజర్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ ఈనెల 19వ తేదీన తలపెట్టిన రణభేరి ప్రచార జాతను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మనోహర్‌కుమార్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం స్థానిక హైస్కూల్‌లో విడుదల చేశారు. కార్యక్రమంలో బీ.కిషోర్, నాగేశ్వరరావు, శ్రీనివాస్, మావుళ్ళ, అప్పారావు, కే. సూర్యచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో ఇంజనీర్ల పాత్ర కీలకం

• లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ శ్యాం రవిప్రకాష్

• ఘనంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి


కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్యామ్

కొవ్వూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రగతిలో ఇంజనీర్ల పాత్ర కీలకమైనదని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ బొంతా శ్యామ్‌రవిప్రకాష్ అన్నారు. జాతీయ ఇంజనీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జీ.సందీప్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ మొట్టమొదటి ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని అన్నారు. ఇంజనీరుగా ఎన్నో నగరాలకు మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల, వరదల నివారణకు కృషి చేశారన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ ఏడీఈ ఎం.కృష్ణనాయక్, పట్టణ, మండల ఏఈలు డీ.జగదీశ్వరరావు, సీహెచ్ శ్రీనివాసరావును శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పీ.జయరాజు, బీ.వెంకటేశ్వరావు, ఎండీ హుస్సేన్ పాల్గొన్నారు.

పెరవలి: వివిధ వంతెనల నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర ఎనలేనిదని మండల పరిషత్ అధ్యక్షుడు కార్చెర్ల ప్రసాద్ పేర్కొన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇంజనీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో పని చేస్తున్న వివిధ శాఖల ఇంజనీర్లను సత్కరించారు. ముఖ్యఅతిథిగా లయన్స్ ప్రముఖులు మాదిరెడ్డి బాబూజీరావు, ఎంపీడీవో పద్మజ, తహశీల్దార్ నిరంజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఏఈ డేవిడ్ నిశ్చల్, పంచాయతీ రాజ్ ఏఈ భగన్నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్, హౌసింగ్ ఏఈ సతీష్, అన్ని గ్రామాలకు చెందిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సన్మానించారు. లయన్స్ క్లబ్ ప్రముఖులు కోలా సీతయ్య నాయుడు, సలాది ఉదయ భాస్కర రావు, కోటిపల్లి మురళీకృష్ణ, గాదిరాజుగనిరాజు, యాతం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్లను సత్కరించుకోవడం ఆనందదాయకమని లయన్స్ క్లబ్ అధ్యక్షులు కరుటూరి చౌదరి అన్నారు. సోమవారం నిడదవోలు పట్టణంలోని లయన్స్ ఆడిటోరియంలో మోక్షగుండం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.నారాయణ అప్పారావు, అసిస్టెంట్ ఇంజనీర్ బి.రమేష్‌బాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గారపాటి మోహన్, కోశాధికారి మట్టపర్తి చంద్రరావు, రంగా వెంకటేశ్వరరావు, బూరుగుపల్లి రాము, కొత్తపల్లిరాకేష్, తదితరులు పాల్గొన్నారు.


పెరవలిలో ఇంజనీర్లను సన్మానిస్తున్న దృశ్యం


నిడదవోలు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్లను సత్కరించిన లయన్స్ ప్రతినిధులు

విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేత



ధర్మవరంలో విద్యార్థులకు అందిస్తున్న దృశ్యం

కొవ్వూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. సోమవారం ధర్మవరం జడ్పీ పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇంటినెక్ట్ డిజైన్ ఎరీనా ప్రైవేట్ లిమిటెడ్ నెలకొల్పిన ఉల్లాస్ ట్రస్టు ఆధ్వర్యంలో టచ్ ద సోషల్ ప్రాజెక్టులో భాగంగా 10 మంది విద్యార్థులు ఒక్కొక్కరికి రూ. 1000 చొప్పున అందజేశారు. కంపెనీ ప్రతినిధి నందిగం బ్రహ్మానందం మాట్లాడుతూ ప్రతిసంవత్సరం కంపెనీ సామాజిక బాధ్యతలో భాగంగా కొవ్వూరు, చాగల్లు మండలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బీ.శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి : ఏవో గంగాధర్


పంట నమోదు చేస్తున్న వ్యవసాయ సహాయకుడు

కొవ్వూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైతులంతా పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో ఏ.గంగాధర్ తెలిపారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 19 రైతు సేవా కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకు 3900 మంది రైతులకు సంబంధించి 11,102 ఎకరాల భూమిలో పండిస్తున్న పంటలను ఈ పంటలో నమోదు చేయడం జరిగిందన్నారు. ఇంకనూ 5,800 ఎకరాలకు సంబంధించి రైతులు నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. ఈ నెలాఖరులోగా రైతులంతా పంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం

పెరవలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తీపర్రు పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ ఒకరు జిల్లా స్థాయి ఉత్తమ టీచర్‌గా, మరొకరు మండల స్థాయి ఉత్తమ టీచర్‌గా అవార్డు పొందడం గ్రామానికే గర్వకారణమని టీడీపీ, జనసేన నేతలు పేర్కొన్నారు. ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన నెంబర్- 2 పాఠశాల ఉపాధ్యాయుడు రవికుమార్‌ను అలాగే మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన నెంబరు - 1 పాఠశాల ఉపాధ్యాయుడు కే.శ్రీనివాస్‌ను కూటమి నాయకులు, గ్రామస్థులు కలిసి సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా విద్యార్థులకు విద్యనభ్యసించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నందమూరి నారాయణరావు, మొగళ్లపు సీతారామ్, జనసేన పార్టీ నాయకులు ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దేవంలో గన్నవరం పశువైద్య కళాశాల ప్రొఫెసర్లు


పశువుల మరణాలపై విచారణ చేస్తున్న ప్రొఫెసర్లు

తాళ్లపూడి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పెద్దేవంలో వరుస గేదెల మరణాలపై విచారణకు గన్నవరం పశువైద్య కళాశాల నుంచి పలువురు ప్రొఫెసర్లు సోమవారం విచ్చేశారు. వ్యాధి బారినపడిన గేదెలను పరిశీలించి రైతులకు కొన్ని సూచనలు చేశారు. ఇటీవల పశుసంవర్ధక శాఖ అధికారులు ఇచ్చిన మందులు గేదెల ఆరోగ్యాన్ని కొంత మెరుగుపరిచాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏడీ వెంకరెడ్డి, ప్రొఫెసర్లు డాక్టర్ జీ. శ్రీనివాసరావు, డాక్టర్ కే. సతీష్, డాక్టర్ సురేష్, మండల పశువైద్యాధికారి డాక్టర్ బాలాజీ పాల్గొన్నారు.

నేడు ఏబీఎన్ కళాశాలలో రక్తదాన శిబిరం

కొవ్వూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధి కేంద్రం ప్రతినిధులు కే.సీలిమ, జీ.అరుణ్‌కుమార్ తెలిపారు. సోమవారం వారు కొవ్వూరు లో మాట్లాడుతూ ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రుల సహకారంతో దీన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శిబిరంలో విద్యార్థులు, రక్తదానం చేయదలిచే దాతలు పాల్గొనాలన్నారు.

సేవా పక్షోత్సవాల్లో పాల్గొనండి

నల్లజర్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు బీజేపీ ఆధ్వర్యంలో సేవా పక్షోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాలరావు అన్నారు. సోమవారం అచ్చన్నపాలెం కల్యాణ మండపంలో బీజేపీ నూతన మండల అధ్యక్షుడు పులమోలు రామకృష్ణ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పక్షోత్స వాల్లో స్వచ్ఛభారత్, క్రీడలు, మెడికల్ క్యాం పులు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. మాజీ మండలాధ్యక్షుడు చెల్లు సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

దేవరపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి చంద్రబాబు నాయుడు కాలనీలో ఉన్న వినాయక ఆలయం వద్ద సోమవారం భారీస్థాయిలో అన్నసమారాధన నిర్వహించారు. గణపతి నవరాత్రి మహోత్సవాల అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

చాగల్లు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభించి నెలరోజుల పాటు నిర్వహిస్తామని, దీన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి యు. ముఖేష్ తెలిపారు. ఈ వ్యాధి పశువుల్లో వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతుందని, వ్యాధి సోకిన పశువులు బలహీన పడటం, జ్వరంతో బాధపడుతూ నోరు, నాలుక వద్ద బొబ్బలు ఏర్పడి మేత మేయకపోవడం, సొంగ కార్చడం వంటివి జరుగుతాయన్నారు. అలాగే పాల ఉత్పత్తి కూడా బాగా తగ్గిపోతుందన్నారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు రైతులు తప్పనిసరిగా ఈ టీకాలు వేయించాలని ఆయన సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చాగల్లు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరుగుతుందని ఎంపీడీవో ఆర్ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. చాగల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా సమావేశంకి హాజరుకావాలని మండల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలుపై జరిగే చర్చల్లో పాల్గొనాలని కోరారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

కొవ్వూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలైనట్టు పట్టణ ఏఎస్‌ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. దొమ్మేరు సావరం గ్రామానికి చెందిన కొలమూరు శివసాయి తన తల్లి కృష్ణవేణితో కలిసి ఈనెల 14వ తేదీ రాజమహేంద్రవరం వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా రోడ్డు కం రైలు బ్రిడ్జిపై ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివసాయి, తల్లి కృష్ణవేణికు గాయాలయ్యాయి. వారిద్దరినీ చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. శివసాయి తండ్రి పోసిబాబు అందించిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

డివిజనల్ పీజీఆర్ఎస్‌కు 12 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): డివిజనల్ పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవో రాణీసుస్మిత ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 12 ఫిర్యాదులు స్వీకరించారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి సోమవారం డివిజన్ స్థాయిలో పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నామన్నారు. అంతేకాకుండా ప్రజలు తమ సమస్యలను కాల్‌సెంటర్ నెంబర్ 1100కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేసుకోవచ్చునన్నారు. నమోదైన ప్రతి ఫిర్యాదు యథార్థ స్థితిగతులను తెలుసుకోవచ్చునన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే కార్యక్రమంలో డివిజనల్, మండల, గ్రామస్థాయి అదికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


ఉంద్రాజవరంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

120 మందికి కంటి పరీక్షలు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బౌద్ధ ధమ్మపీఠంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 120 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. పీఠాధిపతి అనాలయో ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా మందులు అందించారు. ఇందులో 20 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు.

జవహర్‌ను కలిసిన పలువురు


వినతిపత్రం ఇస్తున్న దళిత నాయకులు

కొవ్వూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దళితులకు ఆర్థిక రంగాల్లో రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం పూర్తిగా అందడం లేదని దళిత నేతలు రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్‌కు తెలిపారు. సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్‌పురం మండలం బీసీ కాలనీ, వడ్డిగూడెంకు చెందిన దళితులంతా జవహర్‌ను కొవ్వూరులో కలిశారు. సమాజంలో ఎదుర్కొంటున్న వివక్ష, ఉద్యోగ అవకాశాలు, ఉపాధి కల్పనలో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి వివరించారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వపు హక్కులు అందేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు చింగి విష్ణుమూర్తి, మోదుగ వెంకన్న, ములకలపల్లి సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నల్లజర్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే దశల వారీగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తామని జేఏసీ కన్వీనర్ సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం అన్ని యూనియన్ల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక సబ్ డివిజన్ వద్ద నిరసన తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వానికి తమ సమస్యలతో కూడిన వినతి పత్రం అందించామని వారంతా చెప్పారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు


పల్లంట్లలో ఆకుకూరల విత్తనాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకురాలు సుధారాణి

దేవరపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి పెరట్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా కూరగాయలు, ఆకుకూరలు పండించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని టీడీపీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి కొయ్యల మూడి సుధారాణి పేర్కొన్నారు. పల్లంట్లలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కిచెన్‌గార్డెన్‌లో భాగంగా వ్యవసాయ శాఖ నిర్వహించిన ఆకుకూరలు, కాయగూరల ఉత్పత్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తోందన్నారు. రసాయనిక ఎరువులు వాడకుండా, సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ, టీడీపీ నాయకులు రామలక్ష్మి, పాకా వెంకటలక్ష్మి, టీ.శృతి, టీడీపీ నాయకులు తాలూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ముంపు రైతులను ఆదుకుంటాం : ఆర్డీవో


చిట్యాల శివారులో నీటమునిగిన పొలాలు పరిశీలిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

గోపాలపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి గ్రామాల పరిధిలో నీటమునిగిన వరిపొలాలను ఆర్‌డీవో రాణీసుస్మిత సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముంపు నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు. దీనికోసం వ్యవసాయశాఖాధికారులు, నష్టానికి సంబంధించిన పూర్తివివరాలు సేకరించి వెంటనే నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఆమెతో పాటు తహశీల్దార్ సాయి ప్రసాద్, వ్యవసాయాధికారి ఏసుబాబు, టీడీపీ నాయకులు నూతంగి దొరబాబు, సొసైటీ ఛైర్మన్ గద్దే హరిబాబు, చిట్యాల టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

తెలుగు పండిట్ కృష్ణప్రసాద్‌కు సత్కారం


మోర్త హైస్కూల్‌లో కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్త హైస్కూల్‌లో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న చెరుకూరి కృష్ణప్రసాద్‌ను సోమవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం సత్కరించింది. ఆదివారం గుంటూరులో అఖిలాంధ్ర ఆపన్న ప్రదీప నబ్రాహ్మణ సేవా సమాఖ్య ద్వారా బ్రాహ్మణ ఉత్తమ తెలుగుపండిట్ అవార్డు తీసుకున్న సంగతి తెలిందే. దీంతో ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్త చేస్తూ ఈ సత్కారం చేసింది. తమ పాఠశాలకు చెందిన కృష్ణప్రసాద్ అవార్డు తీసుకోవడం మా పాఠశాలకు మంచిగుర్తింపు తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో ఫ్లెక్సీల రగడ

• మున్సిపల్ అధికారుల తీరుపై విమర్శ


ఫ్లెక్సీలు పట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నేత వెంకటేశ్వరరావు

నిడదవోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో మునిసిపల్ అధికారుల వైఖరితో టీడీపీ, జనసేన పార్టీల మధ్య ఫ్లెక్సీల వివాదం చెలరేగింది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని ఆర్వోబీపై గల కరెంట్‌పోల్స్‌కు ఇరువైపులా టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఫ్లెక్సీలను ఆ పార్టీ నేతలు ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడు తాజాగా సూపర్‌సిక్స్ పథకాల పేరుతో పురపాలక సంఘం మునిసిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ పేరుతో మంత్రి కందుల దుర్గేష్ ముఖచిత్రాన్ని ముద్రించి ఆఫ్లెక్సీపై సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి ఉన్న ఫ్లెక్సీల ఏర్పాటుకు సోమవారం మునిసిపల్ సిబ్బంది ఉపక్రమించారు. అయితే అప్పటికే అక్కడ ఉన్న టీడీపీ ఫ్లెక్సీలను తీసి కింద పారేసి ఉండడాన్ని ఆ దారిలో వెళుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు దృష్టిలో పడింది. దీంతో ఆయన మునిసిపల్ సిబ్బంది కింద పడేసిన ఫ్లెక్సీలను తీసుకుని మునిసిపల్ అధికారుల తీరు నశించాలని నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అధికార పార్టీలో ఉన్న కూటమి ధర్మాన్ని పాటించడం లేదని ఆయన ఆవేదన చెందారు. మునిసిపల్ సిబ్బంది కింద పడేసిన టీడీపీ ఫ్లెక్సీలను తీసుకువెళ్లి పక్కనే ఉన్న పశ్చిమ డెల్టా కాలువలో కలిపేశారు. మరో పక్క భారీ క్రెయిన్‌తో టీడీపీ ఫ్లెక్సీలను తీసి పడేస్తున్న సిబ్బందిని టీడీపీ నాయకులు ప్రశ్నించగా మునిసిపల్ ఏఈ తీసేయమన్నారంటూ కూటమి నాయకులకు సమాధానమిచ్చారు. దీనిపై టీడీపీ పట్టణ అధ్యక్షుడు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మునిసిపల్ అధికారుల తీరు వివాదాస్పదంగా ఉందన్నారు.

రేపు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్

కొవ్వూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ తేదీన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా.కే.ప్రణీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని టోలిగేటు సెంటరులో ఉన్న అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం ఉదయం 9 గంటలకు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హాజరై ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమం అక్టోబర్ 2 వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లలు, స్త్రీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారందరికీ ఉచితంగా వైద్యం అందించి, మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దేవరపల్లి: ప్రధాని మోదీ ఈనెల 17వ తేదీన మధ్యప్రదేశ్‌లో స్వస్తి నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు ఎంపీపీ కేవీకే దుర్గారావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం దీనిపై సమీక్షా సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో వై.రాజారావు, వైద్యాధికారులు, డాక్టర్ సంజీవ్, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో తిరుమలదాసు, కార్యదర్శులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై శిక్షణ

తాళ్లపూడి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రావూరుపాడు రైతుసేవా కేంద్రంలో సోమవారం వివిధ రకాల ఉద్యాన పంటలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్ర కుమార్, ఉద్యాన అధికారి డీ. సుధీర్ కుమార్ హాజరై మాట్లాడుతూ పంటలలో ముఖ్యంగా అరటి మొక్క నాటినప్పుడు, వరి పంటలో చీడపీడలు, తెగుళ్ల ఆశించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీరహరిబాబు, నవభారత్ ఆయిల్‌పామ్ సిబ్బంది, ఉద్యాన, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతు సిద్దా దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కోరుకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీ వైష్ణవ సాంప్రదాయాన్ని అనుసరించి కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహం ఆలయం వద్ద హరేరామ సమాజం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. సాధారణంగా శ్రావణ మాసంలో శ్రావణశుక్లపక్ష అష్టమినాడు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరుగుతాయి. అయితే కోరుకొండలో మాత్రం భాద్రపద మాసంలో అష్టమినాడు శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు చేయడం ఆనవాయితీ. స్వామివారి అనువంశిక ధర్మకర్త పరాసరరంగరాజ భట్టర్ ఆధ్వర్యంలో స్వయంభూగా వెలిసిన కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కొండపైన, దిగువున సోమవారం ఈ వేడుకలు నిర్వహించారు. అలాగే హరేరామ సమాజం వద్ద ఆలయ అధ్యక్షుడు కపిలవాయి నమఃశివాయ శర్మ, ఆలయ ప్రధాన అర్చకుల మిరియాల శేషు ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సత్యవతి ఆధ్వర్యంలో మహిళలు తిరువాయ పారాయణ, ద్వాదశ హారతులు, ద్వాదశ నివేదనలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

• సభను బహిష్కరించిన వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగింది. దీనికి ఎంపీపీ జొనకూటి పోసిరాజు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదటగా 15వ ఆర్థికసంఘం నిధుల చెల్లింపుల విషయంలో సర్పంచులు, ఎంపీటీసీలు ఖర్చు పెట్టేందుకు వీల్లేదంటూ ఎంపీడీవో, సెక్రటరీలు అభ్యంతరం చెప్పడాన్ని వ్యతిరేకిస్తూ సర్పంచులు, ఎంపీటీసీలు ఎమ్మెల్యేకి వినతిపత్రం అందించారు. దీనిపై ఎమ్మెల్యే ఎంపీటీసీ సభ్యులతో మాట్లాడుతుండగా గజ్జరం ఎంపీటీసీ చిన్నాబ్బాయి ఎమ్మెల్యేతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఇప్పటి వరకూ తమకు గౌరవ వేతనం ఇవ్వలేదని అనడంతో గత ప్రభుత్వంలో ఎప్పటి వరకు ఇచ్చారని అడగ్గా, అప్పటి విషయం వద్దని ప్రస్తుతం ఎప్పుడి ఇస్తారని ప్రశ్నించడంతో టీడీపీ వర్గీయులు వైసీపీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రావూరుపాడు ఎంపీటీసీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు గౌరవవేతనం ఇచ్చారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో వచ్చే నిధుల కంటే ఖర్చు అధికంగా చేశారని వచ్చిన నిధులు అత్యవసర పనులకు ప్రణాళికాబద్ధంగా ఖర్చు పెట్టాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ మాత్రం నిధులు కూడా రాలేదని అనటంతో వైసీపీ ఎంపీటీలు గట్టిగా అరవడంతో ఎమ్మెల్యే ఎదురుగానే టీడీపీ వర్గీయులు సభ్యులను అడ్డుకోవడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. దీంతో సభ కాస్త రసాభసాగా మారింది. కార్యక్రమంలో ఏఎంసీ నాదెళ్ల శ్రీరామ్, తహశీల్దార్ లక్ష్మీలావణ్య, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.